

# విభారె

## తెలుగు దినపత్రిక

## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి ఆదివారం 10-07-2022 సంపుటి : 03 సంచిక : 286 పేజీలు : 4 వెల : రూ 3-00

# మీ కష్టాల పునాదులపైనే మన ప్రభుత్వం.. నిండు మనసుతో సెల్యూట్



గుంటూరు/విజయవాడ: భవిష్యత్తుపై చిత్తశుద్ధి ఉన్న పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని వైఎస్సార్‌సీపీ శాశ్వత అధ్యక్షులు, ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్లీనరీ రెండో రోజు సమావేశాల్లో భాగంగా.. రెండో రోజైన శనివారం పార్టీ శాశ్వత అధ్యక్షుడిగా వైఎస్ జగన్‌ను ఎన్నుకుంది ప్లీనరీ. అనంతరం జన సంద్రాన్ని ఉద్దేశించి సీఎం జగన్ ప్రసంగించారు. “ఈరోజు జన సునామీ కనిపిస్తోంది. ఇది ఆత్మీయుల సునామీ. పదమూడేళ్లుగా ఇదే అభిమానం నాపై చూపిస్తున్నారు. కార్యకర్తలు, నేతలు, అభిమానులకు నా సెల్యూట్. అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు అని సీఎం జగన్ పేర్కొన్నారు. పార్టీని గట్టి పునాదిపై నిర్మించుకున్నాం. మీ కష్టాల పునాదులపైనే మన ప్రభుత్వం ఏర్పడింది. రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయ విప్లవాలు నడుస్తున్నాయి. మేం మ్యానిఫెస్టోలో ఏం చెప్పామో.. అవే చేస్తున్నాం. నా ఫోకస్ అంతా ప్రజలకు మంచి చేయడం, వెనుక బడిన వర్గాలకు న్యాయం చేయడమే నా లక్ష్యం అని అన్నారాయన. నాన్న మరణ వార్త విని సుమారు 700 మంది చనిపోయారు. వారందరి కుటుంబాలను పరామర్శించడం నా బాధ్యతగా భావించా. నాపై కాంగ్రెస్, టీడీపీ కలిసి కేసులు వేసి ఎన్నో కుట్రలు చేశాయి. నాపై ఎప్పుడూ కుట్రలు చేస్తూనే ఉన్నారు. ఇలాంటి కుట్రలకు, తప్పుడు కేసులకు లొంగేవాడు కాదు జగన్. నన్ను అన్యాయంగా అరెస్ట్ చేయించిన పార్టీ నామరూపాల్లేకుండా పోయింది. ఆనాడూ చంద్రబాబు మన పార్టీలో ఎమ్మెల్యేలను సంతలో పశువుల్లా కొన్నారు. 2014లో 23 ఎమ్మెల్యేలను కొన్న పార్టీకి.. 2019లో అన్నే సీట్లు వచ్చాయి అని సీఎం జగన్ గుర్తు చేసుకున్నారు.ఒక్క ఎమ్మెల్యేలతో ప్రారంభమైన ప్రయాణం.. ఇప్పుడు 151కి చేరింది. ఒక్క ఎంపీతో ప్రారంభమైన ప్రయాణం.. ఇప్పుడు 22కి చేరిందని గుర్తు చేసుకున్నారు. నిండు మనసుతో మీ అందరికీ సెల్యూట్ చేస్తున్నా అని ప్రజాభివాదం చేశారు సీఎం జగన్.ఈ మధ్య చంద్రబాబు రింగ్‌లో చిప్ ఉందని చెప్తున్నారు. చంద్రబాబులా రింగ్‌లోనో, మోకాళ్లలోనో, అరికాళ్లలోనో చిప్ ఉంటే సరిపోదు. ప్రజల కష్టాలను అర్థం చేసుకునే చిప్ చంద్రబాబుకు లేదు. చంద్రబాబుకు ప్రజల పట్ల మమకారం, ప్రేమ అన్నది ఏమాత్రం లేదు. పేదలు ఎదగకూడదన్నదే చంద్రబాబు, దుష్టచతుష్టయం విధానం. ప్రజలకు మంచి చేయకూడదన్నదే చంద్రబాబు అభిమతం. తమ పిల్లలను ఇంగ్లీష్ మీడియంలో చదివిస్తారు. పేదల పిల్లలు మాత్రం తెలుగు మీడియమే చదవాలంట. నారాయణ, చైతన్యలను మాత్రమే టీడీపీ ప్రోత్సహిస్తుంది. కానీ, మన ప్రభుత్వం ప్రభుత్వ బడులను కార్పొరేట్ తీసుకెళ్లడానికి శ్రమిస్తోంది. ఒక్క విద్యారంగం కోసమే తొమ్మిది పథకాలు తీసుకొచ్చింది.. అంటూ ఇప్పటిదాకా వెచ్చించిన పలు సంక్షేమ నిధుల కేటాయింపులను సభాముఖంగా ప్రకటించారు సీఎం జగన్.14 ఏళ్లు సీఎంగా చేసిన వ్యక్తి.. కుప్పంను రెవెన్యూ డివిజన్ చేయాలని అర్జీ పెట్టుకున్నారు. కుప్పంను రెవెన్యూ డివిజన్ చేసింది మీ జగన్ ప్రభుత్వమే. కుప్పం ప్రజలకు మంచి జరగాలనే అలా చేశాం. మరింత పాదర్శక పాలన కోసమే కొత్త జిల్లాలను ఏర్పాటు చేశాం. టీడీపీ అంటే పెత్తందార్ల ద్వారా పెత్తందార్ల కోసం నడుస్తున్న పార్టీ. చంద్రబాబు పార్టీ సిద్ధాంతమే వెన్నుపోట్లు అని సీఎం జగన్ ప్రస్తావించారు.

## చంద్రబాబు ఎక్కడ పోటీ చేసినా ఓటమి తథ్యం

అమరావతి: విజయవాడ-గుంటూరు జాతీయ రహదారికి సమీపంలో నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ప్లీనరీ బహిరంగ సభ కాదని.. ప్రతినిధుల సభ అని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ‘శుక్రవారం 1.68లక్షల మంది కార్యకర్తలు ప్లీనరీకి హాజరయ్యారు.ఇవాళ 4.5 లక్షల మందికిపైగా పార్టీ ప్రతినిధులు వచ్చే అవకాశం ఉంది. అధికార దుర్వినియోగం ఎక్కడా జరగలేదు. చంద్రబాబు పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు ఎక్కడ పోటీ చేసినా ఓటమి తథ్యం. 175కు 175 స్థానాలు గెలుస్తాం. 25 పార్లమెంట్ స్థానాల్లోనూ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని’ విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.



## 2024లో చంద్రబాబుకు రాజకీయ సమాధే: కొడాలి నాని



గుంటూరు/విజయవాడ: చంద్రబాబు, రామోజీరావు, రాధాకృష్ణ, టీవీ5నాయుడు.. నలుగురు దొంగల ముఠాగా ఏర్పడి రాష్ట్రాన్ని దోచుకున్నారని మాజీ మంత్రి కొడాలి నాని విమర్శించారు. ప్లీనరీ రెండో రోజున ఎల్లో మీడియా-దుష్ట చతుష్టయం తీర్మానంపై చర్చ సందర్భంగా కొడాలి నాని మాట్లాడుతూ.. ‘సీఎం జగన్ ప్రభుత్వంపై ఉదయం నుంచి రాత్రి వరకు దుష్ప్రచారం చేయడమే వీరి పని. సీఎం జగన్‌ను దించాలని ఆ నలుగురు కంకణం కట్టుకున్నారు. చంద్రబాబు సీఎంగా ఉంటే రాష్ట్రాన్ని దోచుకోవచ్చని వీరి ఆలోచన. ఈ ముఠాకి రామోజీరావు గురువు. ఈ 420లకి ఎవరూ భయపడరు. దుష్టచతుష్టయాన్ని పాతాళంలో పాతిపెట్టేందుకు సిద్ధంగా ఉండాలి. ఇంగ్లీష్ మీడియం చదువులు చెప్పిస్తుంటే విమర్శలు చేస్తున్నారు. పేద పిల్లలు ఇంగ్లీష్ మీడియంలో చదవొద్దా?. ఆరోపణలు చేస్తున్న వారి పిల్లలు ఏ మీడియంలో చదివారు?. వైఎస్ జగన్ సీఎం అయ్యాక పెన్షన్లు పెంచుతూ పోతున్నారు. పేద పిల్లల కోసం తండ్రి స్థాయిలో సీఎం జగన్ ఆలోచిస్తున్నారు. చంద్రబాబు ఏనాడైనా ఇలాంటి పథకాలు అమలు చేశారా?. 95 శాతం హామీలను అమలుచేసిన వ్యక్తి సీఎం జగన్. సీఎం జగన్ భగభగమండే సూర్యుడిలాంటోడు. పేదల కోసం పనిచేసే ముఖ్యమంత్రి వైఎస్ జగన్.దేశంలో చంద్రబాబు లాంటి చవట దద్దమ్మ ఎవరూ లేరు. పుట్టిపెరిగిన చంద్రగిరిలో చంద్ర బాబు ఎప్పుడైనా గెలిచాడా?. దుష్టచతుష్టయం పర్మినెం ట్‌గా పిచ్చాసుపత్రుల్లో చేరబోతున్నారు. చంద్రబాబు మతిస్థిమితం తప్పి మాట్లాడుతున్నాడు. గౌరవ అధ్యక్షురాలి పదవికి రాజీనామా చేస్తే.. తల్లి పాత్ర పోతుందా?. తల్లిని మించిన హోదా ఉంటుందా?. లోకేష్ ఫారెన్‌లో ఉన్నప్పుడు చంద్రబాబు ఎలా వెళ్లారు?. ఓట్లకోసం భార్యను బజారుకీడ్చిన 420 చంద్రబాబు. 2024 చంద్రబాబుకు రాజకీయ సమాధే’ అని మాజీ మంత్రి కొడాలి నాని హెచ్చరించారు.

## రెస్క్యూ ఆపరేషన్‌లో చినార్ కార్ప్స్.. యాత్రికుల్ని రక్షిస్తున్న ఇండియన్ ఆర్మీ

శ్రీనగర్: అమర్‌నాథ్ వరదల్లో చిక్కుకున్న యాత్రికుల్ని రక్షించేందుకు చినార్ కార్ప్స్ తీవ్ర ప్రయత్నం చేస్తోంది. 15 కార్ప్స్‌లో లేదా చినార్ కార్ప్స్ బృందం ప్రస్తుతం అమర్‌నాథ్ వద్ద చిక్కుకున్న భక్తుల్ని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. ఇండియన్ ఆర్మీకి చెందిన చినార్ కార్ప్స్ బెటాలియన్.. కశ్మీర్ లోయలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుంది. శుక్రవారం సాయంత్రం అకస్మిక వరదతో అమర్‌నాథ్ యాత్రికులు అతలాకుతలం అయిన విషయం తెలిసిందే. ఇప్పటికే 15 మంది భక్తులు మృతిచెందారు. మరో 40 మంది యాత్రికులు మిస్సింగ్ జాబితాలో ఉన్నారు.అయితే ఇవాళ ఉదయం చినార్ కార్ప్స్ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ ఏడీఎస్ ఔజా అక్కడికి చేరుకున్న పరిస్థితిని ప్రత్యక్షంగా సమీక్షిస్తున్నారు. క్లౌడ్‌బస్ట్‌తో కొట్టుకుపోయిన ప్రాంతాలను ఆయన విజిట్ చేశారు. యాత్రికులతో ముచ్చటించి వారి యోగక్షేమాలను కనుకున్నారు. ప్రస్తుతం అమర్‌నాథ్ వద్ద ఈయన సారథ్యంలోనే రెస్క్యూ ఆపరేషన్ జరుగుతున్నది.క్లౌడ్‌బస్ట్ జరిగిన ప్రాంతం నుంచి 29 మందిని రక్షించినట్లు భారత వైమానిక దళానికి చెందిన అధికారులు తెలిపారు. ఆ భక్తుల్లో 9 మంది తీవ్రంగా గాయపడినట్లు అధికారులు చెప్పారు. వరద నీటితో కొట్టుకువచ్చిన శిథిలాలను చినార్ కార్ప్స్ సైనికులు తొలిగిస్తున్నారు. గల్లంతు అయిన వారి కోసం కార్ప్స్ తీవ్రంగా గాలిస్తున్నారు. చినార్ కార్ప్స్ దళాలు అత్యాధునిక పరికరాలతో గాలింపు చర్యలు ప్రారంభించారు.



## తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు..


### పొంగి పొర్లుతున్న వాగులు

దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ నైరుతి రుతుపవనాలు అత్యంత క్రియాశీలకంగా మారినట్టు భారత వాతావరణ విభాగం వెల్లడించింది.పశ్చిమ మధ్య బంగాళాఖాతం నుంచి ఒడిశా - కోస్తాంధ్ర తీరం వరకూ ఉపరితల ద్రోణి కొనసాగుతున్నట్టు ఐఎండీ తెలియజేసింది. మరోవైపు రాజస్థాన్‌లోని జైసల్మేర్ నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకూ మరో ఉపరితల ద్రోణి కూడా కొనసాగుతోందని తెలిపింది. వీటన్నిటి ప్రభావంతో జమ్మూకశ్మీర్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నట్టు తెలిపింది.నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోనూ విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గత మూడు, నాలుగు రోజులుగా రెండు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వానలు పడుతున్నాయి. ఏకధాటిగా కురుస్తోన్న వానలతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. భారీ వర్షాలతో నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలోని పలు చెరువులు అలుగు పారుతున్నాయి. నవిపేట్ మండలం జన్నపల్లి పెద్ద చెరువు అలుగు పారుతుంది. గతంలో ఎప్పుడూ ఇంత పెద్ద ఎత్తున అలుగు పారలేదని స్థానికులు చెబుతున్నారు. మండలంలోని లింగాపూర్ శివారులో వరద ఉధృతికి తుంగిని మాటు కాల్వకు పలుచోట్ల గండి పడి నీరు పంటపొలాల్లో కి చేరి సుమారు వంద ఎకరాల పంట నీట మునిగింది.భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుండడంతో మణుగూరు ఏరియా బొగ్గు గనుల్లో వరద నీరు చేరింది. భారీ వర్షంతో 32 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. 17 భారీ మోటార్ల సాయంతో వర్షపు నీటిని అధికారులు బయటకు పంపిస్తున్నారు.



## జగన్ అంటే తగ్గేదేలే.. సోనియాకే భయపడలే.. దుష్టచతుష్టయానికి భయపడతారా?

విజయవాడ/గుంటూరు: చంద్రబాబు, రామోజీరావు, రాధాకృష్ణ, టీవీ5 నాయుడు.. దుష్టచతుష్టయం కలిసి మీడియా వ్యవస్థను దారుణంగా తయారు చేశారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని నాని విమర్శించారు. ప్లీనరీ రెండో రోజున ఎల్లో మీడియా-దుష్ట చతుష్టయం తీర్మానంపై చర్చ సందర్భంగా మాట్లాడారు. ‘దుష్టచతుష్టయంలో మొదటి దొంగ చంద్రబాబు, రెండో దొంగ రామోజీరావు, మూడో దొంగ రాధాకృష్ణ, నాలుగో దొంగ టీవీ5 నాయుడు. ఈ నలుగురిది కూడా మనోడు మాత్రమే అధికారంలో ఉండాలని ఉన్మాద ప్రయత్నం. అందుకోసం ఎంతకైనా తెగిస్తారు. ఇప్పుడు కూడా రోజూ



విషపు రాతలు రాస్తున్నాయి.రామోజీరావు నమ్మక ద్రోహి అని ఎన్‌టీఆర్ ఆనాడే అన్నారు. ఔటర్ రింగ్ కట్టానని చంద్రబాబు చెబుతారు. మరి భూసేకరణ వైఎస్సార్ ఎందుకు చేశారు?. అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబును మించిన వారు లేరు. డబ్బు కోసం రాధాకృష్ణ చేయని దుర్మార్గాలు లేవు. ఏపీలో కందిపప్పు రేటు ఎంత? తెలంగాణలో ఎంత? నీ హెరిటేజ్‌లోఎంత ఉంది?. ఆయిల్ ధరలు మిగతా రాష్ట్రాల్లో ఎలా ఉన్నాయి.సీఎం జగన్ పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారు. నాలాంటోళ్లు వస్తుంటారు.. పోతుంటారు.. సీఎం జగన్‌కోసం పనిచేయాలి. ఇంటింటికి తిరగండి.. పథకాలు అందినవా.. లేదా ఆరా తీయాలన్నారు. పథకాలు రాకపోతే భాధ్యత వహించి సరిదిద్దాలన్నారు. అర్హత ఉంటే ఏ పార్టీ అయినా సంక్షేమ పథకాలు అందాలని సీఎం చెప్పారు. ఎవరూ శాశ్వతం కాదు..జెండా మోసే కార్యకర్తలు శాశ్వతం.సింగిల్‌గా రాలేమని చంద్రబాబు, పవన్‌కు తెలుసు.. అందుకే అందరూ కట్ట కట్టుకుని రావాలని చూస్తున్నారు. సోనియా గాంధీనే గడగడలాడించిన వ్యక్తి సీఎం జగన్. చంద్రబాబుతో కలిసి ఎన్ని కుట్రలు చేసినా, 16 మాసాలు జైల్లో పెట్టినా అడుగు వెనక్కు తగ్గలేదు. జగన్ అంటే తగ్గేదేలే. అలాంటి వ్యక్తి ఈ దుష్టచతుష్టయానికి భయపడతాడా? అంటూ పేర్ని నాని సభికుల్ని ఉద్దేశించి ప్రసంగించారు.


## అమర్నాథ్ యాత్రికుల భద్రతకు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశాలు

అమరావతి అమర్నాథ్ యాత్రలోకుండపోత వాన, ఆకస్మాత్తుగా వరదలు వచ్చాయన్న సమాచారం నేపథ్యంలో రాష్ట్రం నుంచి వెళ్లిన పలువురి యాత్రికుల భద్రతకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైయస్.జగన్ అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుని వారికి ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల నేపథ్యంలో సీఎంఓ అధికారులు ఢిల్లీలోని ఏపీ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్తో మాట్లాడారు. అడిషనల్ రెసిడెంట్ కమిషనర్గా ఉన్న హిమాంశు కౌసిక్ను వెంటనే శ్రీనగర్కు పంపిస్తున్నారు. యాత్రికుల భద్రత, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో ఆయన సమన్వయం చేసుకుంటారు. అవసరమైన చర్యలు తీసుకుంటారు.

## కాకినాడలో పోస్ట్‌మాస్టర్ మోసం..

### లక్షలతో రాత్రికి రాత్రే పరార్

కాకినాడ జిల్లాలో ఓ పోస్ట్ మాస్టర్ పక్కా ప్లాన్ వేసి వినియోగదారులకు కుచ్చుటోపీ పెట్టాడు. రాత్రికి రాత్రేకే లక్షలతో జంపయ్యాడు. ఈ పోస్టాఫీస్‌లో రూపాయి రూపాయి కూడబెట్టుకున్న వారంతా పోస్ట్ ఆఫీస్ ఎదుట గొల్లుమంటున్నారు. తమకు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. ఈ ఘరానా మోసం కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కేశవపురంలో చోటుచేసుకున్నది.పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాళ్లరేవు మండలం కేశవపరంలో పోస్ట్‌ఆఫీస్ ఉన్నది. ఈ పోస్టాఫీస్‌కు పోస్ట్‌మాస్టర్‌గా సుబ్రహ్మణ్యం మూడేండ్లుగా పనిచేస్తున్నాడు. నిత్యం వచ్చే వారిని పలుకరిస్తూ వారి బాగోగులు తెలుసుకుంటూ ఉండే సుబ్రహ్మణ్యం.. పోస్టాఫీస్ వినియోగదారులకు చిరపరితుడిగా మారాడు. పోస్టాఫీసులో సుకన్య సమృద్ధి యోజన పథకం పేరుతో నెలనెలా మదుపు చేసిన డబ్బును తన అకౌంట్లో వేసుకున్న సదరు పోస్ట్ మాస్టర్.. రాత్రికి రాత్రే చెప్పాపెట్టకుండా పెట్టాబేడా సర్దుకుని పరారయ్యాడు. విషయం తెలుసుకున్న వినియోగదారులు కేశవపురం పోస్టాఫీస్ వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని అధికారులకు వేడుకున్నారు.అలాగే, ప్రభుత్వం




అందిస్తున్న అమ్మ ఒడి పథకం డబ్బులను కూడా కాజేసినట్లు పలువురు మహిళలు ఆరోపించారు. తాము డబ్బు జమ చేసిన సందర్భాల్లో పాసు బుక్కులు వెంటనే ఇవ్వకుండా కాలాయాపన చేసేవాడని, అమ్మ ఒడి పథకం డబ్బులకు చెక్కులిస్తానన్నాడని స్థానికులు చెప్పారు. పాస్‌బుక్కులో స్టాంప్ వేయకుండా మమ్మల్ని మోసం చేశాడని వారు ఫిర్యాదు చేశారు. అకౌంట్ నంబర్ వేయకుండానే పే ఇన్ స్లిప్ రాసి డబ్బులు విత్‌డ్రా చేసినట్లు కౌంటర్ ఫాయిల్ ఇచ్చినట్లు పలువురు చెప్పారు. తాము ఐదేండ్లుగా నగదు జమ చేస్తున్నా ఎలాంటి పాస్ బుక్కు గానీ, కౌంటర్ ఫాయిల్స్‌గానీ ఇవ్వలేదని కొందరు మహిళలు వాపోయారు. బాధితులు ఆందోళన చేస్తుండటంతో పోలీసులు అక్కడికి చేరుకుని.. బాధితుల నుంచి వివరాలు అడిగి తెల్సుకున్నారు.

# సంపాదకీయం

ఆదివారం 10-07-2022

## రష్యాతో ముందడుగు....

రెండు దశాబ్దాలుగా ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచంలో అన్ని దేశాలు ఒకదాని మీద మరొకటి ఆధారపడి ఉంటున్నాయి. కాబట్టి ఎక్కడ ఏ దేశంలోనైనా చిన్న సమస్య వచ్చినా మొత్తం ప్రపంచం తల్లడిల్లుతున్నది. తాజాగా రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో ప్రపంచ దేశాలతో పాటు మన దేశం కూడా అనేక ఒడిదుడుకులను చవి చూస్తున్నది. ప్రపంచ దేశాలు మన దేశంపైన కొన్ని ఒత్తిడులు తీసుకుని రావడానికి ప్రయత్నిస్తున్నాయి. కానీ, మన ప్రభుత్వం దేశ ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని ఒత్తిడులకు లోనుకాకుండా, రష్యాతో పలు వాణిజ్య వర్తక సంబంధాలు కొనసాగించడం మంచి నిర్ణయం. దీంతో మన విదేశీ నిల్వలు మరింత క్షీణించకుండా ఉ న్నాయి. 2022 జనవరి నుంచి మునుపెన్నడూ లేని విధంగా రష్యాతో అనేక దిగుమతులు ఎక్కువగా, సరసమైన ధరలకు మనకు లభిస్తున్నాయి.జనవరి నుంచి మే వరకు రష్యా నుంచి ముడిచమురు దిగుమతులు 286 శాతం పెరిగాయి. అంటే, 1,586 మిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన దిగుమతి జరిగింది. అదే సమయంలో బొగ్గు దిగుమతి 345 శాతం పెరిగి సుమారు 739 మిలియన్ అమెరికన్ డాలర్ల దిగుమతి జరిగింది. ఇతర పెట్రో ఉత్పత్తులు 570 శాతం పెరిగి సుమారు 889 మిలియన్ అమెరికన్ డాలర్లు దిగుమతి జరిగింది. ఇక ప్రాజెక్టు గూడ్స్ దిగుమతులు 53 శాతం పెరిగి 244 మిలియన్ అమెరికన్ డాలర్లు, సన్ ఫ్లవర్ ఆయిల్ 178 శాతం పెరిగి 242 మిలియన్ అమెరికన్ డాలర్లు దిగుమతి జరిగింది. గత 2021 సంవత్సరంతో పోలిస్తే, రష్యాతో భారత్ దిగుమతులు రెండు శాతం నుంచి ఏడున్నర శాతం పెరిగాయి. అదే సందర్భంలో కువైట్, నైజీరియా నుంచి మన దిగుమతులు తగ్గుముఖం పట్టాయి.ఉక్రెయిన్-రష్యా యుద్ధం ఐదు నెలలుగా కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో ముఖ్యంగా యూరప్ ఖండంలో నాటో సభ్య దేశాలు, అంతర్జాతీయ సంస్థలు రష్యాపై అనేక తీవ్రమైన ఆంక్షలు విధించాయి. అభివృద్ధి చెందిన చాలా దేశాలు ఉక్రెయిన్‌కు బాసటగా నిలిచి ఈ యుద్ధం మరికొన్ని రోజులు సాగే విధంగా సహకరిస్తున్నాయి. అంతేకానీ, యుద్ధం నివారించడానికి ప్రయత్నాలు ముమ్మరం చేయడం లేదు. ఈ యుద్ధం రెండు కూటములు మధ్య జరుగుతున్న యుద్ధం అంతర్గత ఆధిపత్య పోరుగా విశ్లేషకులు భావిస్తున్నారు. అదే సందర్భంలో రష్యాతో పాటు చైనా ఆర్థిక వ్యవస్థ బలహీనపడటానికి పలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆధిపత్య పోరులో భాగంగా ఈ అభివృద్ధి చెందిన దేశాలన్నీ ప్రపంచ ఆర్థిక సామాజిక వ్యవస్థలో అనేక మార్పులకు, ఒడుదుడుకులకు కారణమవుతున్నాయి.ఈ ఐదు నెలలు అనగా జనవరి నుంచి మే వరకు రష్యా నుంచి ముడిచమురు దిగుమతులు 286 శాతం పెరిగాయి. అంటే, 1,586 మిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన దిగుమతి జరిగింది. అదే సమయంలో బొగ్గు దిగుమతి 345 శాతం పెరిగి సుమారు 739 మిలియన్ అమెరికన్ డాలర్ల దిగుమతి జరిగింది. ఇతర పెట్రో ఉత్పత్తులు 570 శాతం పెరిగి సుమారు 889 మిలియన్ అమెరికన్ డాలర్లు దిగుమతి జరిగింది. ఇక ప్రాజెక్టు గూడ్స్ దిగుమతులు 53 శాతం పెరిగి 244 మిలియన్ అమెరికన్ డాలర్లు, సన్ ఫ్లవర్ ఆయిల్ 178 శాతం పెరిగి 242 మిలియన్ అమెరికన్ డాలర్లు దిగుమతి జరిగింది. 2021 సంవత్సరంతో పోలిస్తే, రష్యాతో భారత్ దిగుమతులు రెండు శాతం నుంచి ఏడున్నర శాతం పెరిగాయి. అదే సందర్భంలో కువైట్, నైజీరియా నుంచి మన దిగుమతులు తగ్గుముఖం పట్టాయి.ముఖ్యంగా గత సంవత్సరం నైజీరియా నుంచి దిగుమతులు 5.1 శాతం ఉండగా నేడు 3.3 శాతానికి తగ్గాయి. కువైట్ నుంచి గత సంవత్సరం దిగుమతులు 5.1 శాతం ఉ ండగా, ప్రస్తుతం 2.9 శాతానికి తగ్గాయి. మొత్తంగా గత సంవత్సరం రష్యా నుంచి మనం చేసుకున్న దిగుమతులు కేవలం ఒక శాతం నుంచి రెండు శాతం మధ్యన ఉండగా, ప్రస్తుతం నాలుగు శాతానికి పెరిగాయి. దీనికి కారణం ప్రపంచ దేశాల కంటే రష్యా మనకు తక్కువ ధరలకు సరఫరా చేయడం, మన రూపాయి మారకం ఆధారంగా వ్యాపారం చేయడానికి సుముఖత వ్యక్తం చేయడం. చైనాతో మన దిగుమతులు తగ్గుముఖం పట్టాయి. గత సంవత్సరంలో 15 శాతంగా ఉన్న వివిధ రకాల వస్తువుల దిగుమతులు నేడు 12 శాతానికి పడిపోయాయి. గతంలో మన దేశానికి రష్యా దిగుమతులు చేసే క్రమంలో 20వ స్థానంలో ఉండగా, ప్రస్తుతం ఆరవ స్థానానికి చేరుకుంది. ఈ పెరుగుదల అంతా ఈ సంవత్సరం ఏప్రిల్ మే నెలలలోనే జరిగిన వాణిజ్య వర్తక సంబంధాలు ఆధారంగా నిర్ధారించినదే. ప్రస్తుతం మన దేశ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రష్యాతో దిగుమతులు ఎక్కువగా జరుగుతున్నాయి. అదే సందర్భంలో మన దేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత అనేక రంగాలలో రష్యా మనకు ఆర్థిక, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందించింది.మన దేశ పాలకులు కూడా సమస్యల పరిష్కారానికి చర్చలే మార్గమని చెబుతున్నారు. కావున రష్యా-ఉక్రెయిన్ దేశాలు అంతర్జాతీయ శాంతి ఒప్పందాలకు లోబడి ప్రపంచ పౌరుల సంక్షేమం కోసం సాధ్యమైనంత త్వరగా యుద్ధానికి ముగింపు పలకాలని కోరుకుందాం. ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలు, ఉభయ దేశాల శ్రేయస్సు కోరే దేశాలు ఈ యుద్ధం ముగించడానికి ముందుకు రావాలని ఆశిద్దాం.

# వెంకన్నకు 111 ట్రక్కుల కూరగాయలు

విజయవాడ, జూలై 9,కలియుగ వైకుంఠం తిరుమల తిరుపతి పుణ్యక్షేత్రం. తిరుమల గిరులపై శ్రీమహావిష్ణువు.. వేంకటనాథుడిగా భక్తులతో పూజలను అందుకుంటున్నాడు. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కలియుగదైవంగా కీర్తింపబడుతున్నాడు. ప్రతి హిందువు కల శ్రీవారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకోవడం. అందుకనే తమకు వీలైనప్పుడల్లా.. తిరుమలకు వెళ్లి.. స్వామివారి దర్శనం చేసుకుంటారు. దర్శనానంతరం.. శ్రీవారి భోజనాన్ని మహా ప్రసాదంగా భావించి స్వీకరిస్తారు. కొండపై ఉన్నన్ని రోజులు ఉచితంగా లభించే ఈ భోజనం చేయడానికి ఇష్టపడతారు. ఎంతో రుచికరంగా ఉండే ఈ భోజనం వెనక.. అనేకమంది స్వామి వారి సేవకుల శ్రమ దాగి ఉందితిరుమల కొండపై శ్రీవారిని రోజుకి దాదాపు డెబ్బై ఐదు వేల నుండి లక్ష మంది భక్తులు దర్శనం చేసుకుంటారని అంచనా.. మరి ఇంత మంది భక్తులకు రోజూ.. అన్నదానం చేయడం అంటే.. అది ఒక్క శ్రీవారికి సాధ్యమేమో.. అది కూడా భారీ ఎత్తున జరిగే ఈ అన్నదానము రుచిగా శుచిగా చేయడం విశేషం. తిరుమలలో నిత్యాన్నదానం 1983లో మొదలు పెట్టారు. ఈ కార్యక్రమం నేటి వరకు అప్రతిహంగా సాగుతూనే ఉంది.తిరుమలలో ఒక్కరోజుకి జరిగే ఉచిత అన్నప్రసాద ఖర్చు సుమారు రూ. 35 లక్షలు ఉంటుందని అంచనా. అన్నప్రసాదం కోసం ఏడాదికి ఒకసారి.. బియ్యం భారీ మొత్తంలో స్వామి వారి డబ్బులతోనే కొనుగోలు చేస్తారు. మరి అంతమందికి అన్నంతో పాటు.. కూర, పప్పు, సాంబారు, పెరుగుని వడ్డిస్తారు.. మరి వేలాది మంది భక్తులకు సరిపడా కూరలు వండాలంటే.. రోజుకి ఎన్ని కూరగాయలు కావాలి. మరి భారీ సంఖ్యలో కూరగాయలు తిరుమలకి ఎలా చేరతాయని ఎప్పుడైనా ఆలోచించారా..తిరుమలలో నిత్యాన్నదానానికి వెళ్లే కూరగాయలు మొత్తం కేవలం ఒక తొమ్మిది మంది మహా భక్తుల సంకల్పంతో ఎన్నో సంవత్సరాల నుండి పూర్తిగా ఉచితంగా వెళ్తున్నాయన్న సంగతి తెలుసా.. అది కూడా ఈ తొమ్మిది మంది భక్తులు కూడా మన దక్షిణ భారతదేశం వారే. ఆంధ్రపదేశ్ లోని విజయవాడ, పలమనేరు, మదనపల్లె, కర్ణాటక లోని చింతామణి, చిక్బల్లాపూర్, తమిళనాడులోని కోయంబెడు , తిరుప్పూర్ ప్రాంతాలకి చెందిన భక్తులు తిరుమల క్షేత్రానికి నిత్యాన్నదానం కోసం కూరగాయలను సమర్పిస్తున్నారు.ఈ తొమ్మిది మంది భక్తులు తమ తమ ప్రాంతాల్లో పండే వివిధ రకాల కూరగాయలు పెంచుతున్న రైతుల వద్దకు వెళ్ళి కూరగాయలు సేకరిస్తారు. ఇలా సేకరించిన కూరగాయలను.. ఒకచోటికి చేర్చి, వాటిని తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన కూరగాయల ట్రక్ లోకి ఎక్కించి తిరుమలకి పంపిస్తారు. ఇలా ఒక్కొక్క ట్రక్ లో 10 టన్నుల కూరగాయలు తిరుమలకి చేరుకుంటాయి. ఇలా కూరగాయలను తిరుమల కొండకు చేర్చడానికి ఒకొక్క ట్రక్ పంపడానికి కనీసం లక్ష నుండి లక్షన్నర రూపాయల ఖర్చు అవుతుంది. రవాణా చార్జీలను కూడా ఈ తొమ్మిది మంది.. తమ ప్రాంతాలకు చెందిన భక్తుల నుంచి సేకరిస్తారు. నెలలో ఒక ప్రాంతం నుండి కనీసం రెండు ట్రక్కుల కూరగాయలు వెళ్తాయి. అయితే ఈ కూరగాయల సంఖ్య.. స్వామివారిని దర్శించుకునే భక్తుల సంఖ్యను బట్టి మారుతూ ఉంటుంది.విజయవాడ లోని శ్రీవారి భక్తుడు శ్రీనివాస్ సంకల్పంతో, 2014 లో మొదలైన కూరగాయల పంపిణీ కార్యక్రమం.. నేటికీ నిరాటంకంగా నడుస్తోంది. ఈ ప్రాంతంలోని శ్రీవారి భక్తులు వెంకటేశ్వర భక్త సమాజంగా ఏర్పడ్డారు. తమ ప్రాంతాల రైతులని సంప్రదించి కూరగాయలు సేకరించి..స్వామివారి అన్నదానాన్ని అందజేస్తూ.. ఒక యజ్ఞంలా ఈ కార్యాన్ని నడుస్తున్నారు. ఇలా ఈ విజయవాడ ప్రాంతంలోని వారు ఇప్పటివరకు 111 ట్రక్కుల కూరగాయలు స్వామి నిత్యఅన్నదానానికి పంపించారు. ఈ కార్యక్రమానికి శ్రీవారి ప్రధాన అర్చకులు సకుటుంబ సపరివారంగా హాజరు అయ్యి విజయవాడ భక్త సమాజం వారికి తమ ఆశీస్సులు అందించారు. ఎన్ని సమస్యలు.. ఒత్తిళ్ళు ఉన్నా.. శ్రీవారికి, భక్తులకి ఎలాంటి సేవలందించడానికయినా ఈ భక్త సమాజం ముందు ఉంటుంది. ఎవరైనా ఈ మహా కార్యంలో భాగస్వామ్యులు కావాలి అనుకుంటే.. ఈ భక్త సమాజాన్ని సంప్రదించవచ్చు

# జనసేనకు ఈసీ షాక్...

విజయవాడ, జూలై 9, ఏపీ రాజకీయాలలో చురుకుగా, క్రియాశీలంగా వ్యవహరిస్తున్న జనసేన పార్టీ ఈసీ నిబంధనల మేరకు ఆదాయ వ్యయాలను సమర్పించలేదని తేలింది. ఎవరైనా సరే నాకు మద్దతు ఇవ్వాల్సిందే అంటూ ఏపీ రాజకీయాలలో హల్ చల్ చేస్తున్న జనసేన అధినేతకు ఈడీ షాక్ ఇచ్చింది. జనసేన పార్టీ ఆదాయ వ్యయాలను ఈ నెలాఖరు లోగా సమర్పించాలని నోటీసులు జారీ చేసింది. ఒక వేళ వాటిని సమర్పించడంలో విఫలమైతే పార్టీ రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని ఆ నోటీసులో ఈసీ హెచ్చరించింది. అయితే ఇలా నోటీసులు అందుకున్న పార్టీ ఒక్క జనసేన మాత్రమే కాదు. తెలుగు రాష్ట్రాలకు చెందిన 119 రాజకీయ పార్టీలకు ఈ నోటీసులు జారీ చేసింది. ఈసీ నోటీసులు అందుకున్న పార్టీలలో జనసేనతో పాటు కేఏ పాల్ నేతృత్వంలోని ప్రజా శాంతి పార్టీ, తెలంగాణ జన సమితి, లోక్ సత్తా, తెలంగాణ ఇంటి పార్టీ, నవ తెలంగాణ, ప్రజా రాజ్యం పార్టీ, తల్లి తెలంగాణ పార్టీ, సమాజ్వాది ఫార్వర్డ్ బ్లాక్, జై స్వరాజ్, మన తెలంగాణ పార్టీ, జన రాజ్యం పార్టీలు కూడా ఉన్నాయి. రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ రద్దు చేసే అధికారం ఇవ్వాలని కేంద్ర ఎన్నికల కమిషన్ కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖను గతంలోనే కోరిన సంగతి తెలిసిందే.అయితే ఈసీ వినతిపై కేంద్రం నుంచి ఇంకా ఎటువంటి సమాధానం రాలేదు. అయితే ఈ లోపే ఎన్నికల కమిషన్ ఆదాయ వ్యయాలను సమర్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పార్టీలకు నోటీసులు జారీ చేసి షాక్ ఇచ్చింది. ఈ నెలాఖరులోగా పార్టీ ఆదాయ వ్యయాలను సమర్పించకుంటే ఆయా పార్టీల రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని నోటీసుల్లో పేర్కొంది. ఇన్ కమ్ టాక్స్ ఎగ్జంప్షన్ కోసమే చాలా పార్టీలు రాజకీయ పార్టీలుగా రిజిస్టరు చేసుకుంటున్నాయని ఈసీ భావిస్తోంది. ఈ క్రమంలోనే ఆదాయ వ్యయ వివరాలు సమర్పించని పార్టీలకు నోటీసులు జారీ చేసింది. అసలు ఆదాయ పన్ను మినహాయింపు పొందేందుకే కొందరు రాజకీయ పార్టీలను రిజిస్టర్ చేస్తున్నారనీ, అటువంటి పార్టీలను నియంత్రించాల్సిన అవసరం ఉందని చాలా కాలంగా ఈసీ కోరుతున్న సంగతి తెలిసిందే.

# వైసీపీలో శాశ్వత అధ్యక్షుడి ఇష్యూ

విజయవాడ, జూలై 9, ఆంధ్రప్రదేశ్ లో అధికారంలో ఉన్న వైసీపీలో ఏదో జరుగుతోంది. ఆ పార్టీ అధినేతలో భయం గూడుకట్టుకుందా అన్న అనుమానాలు ఆ పార్టీ శ్రేణుల్లోనే వ్యక్తమౌతున్నాయి. లేకపోతే ఉరుములేని మెరుపులా పార్టీ శాశ్వత అధ్యక్షుడిగా తనను తాను ప్రకటించుకునేందుకు జగన్ ఎందుకు అంత తొందరపడుతున్నారు. తనపై తిరుగుబాటు చేసి ఎవరైనా పార్టీ అధ్యక్షపదవిని తన్నుకుపోతారని భావిస్తున్నారా? అన్న అనుమానాలను పరిశీలకులు సైతం వ్యక్తం చేస్తున్నారు.పార్టీ శాశ్వత అధ్యక్షుడిగా జగన్ ను నియమిస్తూ పార్టీ ప్లీనరీ వేదికగా ఎందుకు నిర్ణయం తీసుకునే పరిస్థితి వచ్చిందని ప్రశ్నిస్తున్నారు. ప్రతి రెండేళ్లకూ ఒక సారి పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకోవాలన్న పార్టీ బైలాస్ ను ఇప్పటికిప్పుడు ఎందుకు సవరణ చేసి మరీ జగన్ ను శాశ్వత అధ్యక్షుడిగా నియమించేందుకు తొందర పడుతున్నారు? ఈ ప్రశ్నలన్నిటికీ ప్లీనరీ వేదికగా సమాధానం దొరుకుతుందో లేదో ఇప్పటికైతే తెలియదు కానీ, హడావుడిగా పార్టీ బైలాస్ ను సవరించి మరీ జగన్ ను శాశ్వత అధ్యక్షుడిగా ప్రకటించేందుకు పడుతున్న తొందర వెనుక ఉన్న కారణం భయమేనని విశ్లేషిస్తున్నారుఅదే సమయంలో ప్లీనరీ వేదికగా పార్టీ గౌరవాధ్యక్షురాలు విజయమ్మ చేత రాజీనామా చేయించేందుకు నిర్ణయించడం కూడా ఆమె వలన పార్టీలో చీలిక వస్తుందా అన్న భయమే కనబడుతోందని అంటున్నారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రి తానేటి వనితలు పార్టీ బైలాస్సవరణ విషయంలో ఇప్పటికే ఓ ప్రకటన చేశారు. వైసీపీ ఆవిర్భవించినప్పటి నుంచీ పార్టీ అధ్యక్షుడిగా జగనే కొనసాగుతున్నారు.పార్టీ నియమావళి మేరకు ప్రతి రెండేళ్లకూ ఓ సారి పార్టీ ఆయననే అధ్యక్షుడిగా ఎన్నుకుంటూ వస్తోంది. ఆ ఎన్నిక కూడా ఏకగ్రీవమే. పోటీ మాటే లేదు. అయితే ఇప్పుడు హఠాత్తుగా ప్రతి రెండేళ్ల కోసారి పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకునే ప్రక్రియకు ఫుల్ స్టాప్ పెట్టి శాశ్వత అధ్యక్షుడిగా జగన్ ను నియమించాల్సిన అత్యవసర పరిస్థితి ఎందుకు వచ్చింది. అలాగే పార్టీ ఆవిర్భావం నుంచీ కూడా పార్టీ గౌరవాధ్యక్షురాలిగా ఉన్న విజయమ్మను ఆఘమేఘాల మీద తొలగించాల్సిన అవసరం ఏమిటి? అన్న ప్రశ్నలకు పరిశీలకులు మాత్రం పార్టీలో మారుతున్న పరిస్థితి, పెరుగుతున్న అసంతృప్తే కారణమని అంటున్నారు.జగన్ పట్ల అసంతృప్తితో ఉన్న నేతలు, శ్రేణులు విజయమ్మను ఆశ్రయిస్తారన్న భయమే ఆమెను పార్టీ గౌరవాధ్యక్షురాలి పదవి నుంచి తప్పించాలన్న జగన్ నిర్ణయానికి కారణంగా చెబుతున్నారు. అదే సమయంలో పార్టీలో తిరుగుబాటు భయమే జగన్ ను తనను పార్టీ శాశ్వత అధ్యక్షునిగా నియమించుకునే దిశగా నడిపిందని అంటున్నారు.ఇటీవల మహారాష్ట్రలో సంభవించిన పరిస్థితుల నేపథ్యంలోనే జగన్ లో ఈ భయం మరింతగా పెరిగిందని విశ్లేషకులు అంటున్నారు. మహారాష్ట్ర శివసేనలో తిరుగులేని నేతగా వెలుగొందుతున్న ఉద్ధవ్ థాక్రేపై ఏక్ నాథ్ షిండే తిరుగుబాటు చేసి తమదే అసలైన శివసేన అని క్లెయిమ్ చేసుకుంటున్న సంగతి విదితమే. తన ముందస్తు ప్రణాళికలు, పార్టీలో పెరుగుతున్నఅసమ్మతి నేపథ్యంలో జగన్ ముందు జాగ్రత్తగా శాశ్వత అధ్యక్ష పదవిని చేపట్టాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు.

# ఉత్తరాంధ్రలో టీడీపీ ముక్కలాట...

శ్రీకాకుళం, జూలై 9, ఉత్తరాంధ్రలో కీలకంగా ఉండే ఉమ్మడి విజయనగరం జిల్లా ఒకప్పుడు టీడీపీకి కంచుకోట. అధినేతలు సైతం ఇక్కడ నుంచి పోటీ చేయడానికి ఆసక్తి చూపించేవారు. రోజులన్నీ ఒకేలా ఉండవన్నట్టు రాజకీయం మారిపోయింది. 2014 ఎన్నికల తర్వాత అది స్పష్టంగా కనిపిస్తోంది. ఆ ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చినా.. పార్టీ రెండు వర్గాలుగా విడిపోయింది. కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు శిబిరంలో కొందరు? ఆయనంటే గిట్టని వారు మరో శిబిరంలో చేరిపోయారు.2014లో టీడీపీ గెలిచాక.. జిల్లా ఇంఛార్జ్ మంత్రిగా గంటా శ్రీనివాసరావు రావడంతో.. అశోక్ అంటే గిట్టని వారు.. ముఖ్యంగా కాపు సామాజికవర్గం ఆయనకు చేరువైంది. కిమిడి మృణాళిని.. కేఏ నాయుడు, కంది చంద్రశేఖర్, కర్రోతు బంగ్రరాజు, మీసాల గీత వంటి నాయకులు తరచూ సమావేశమై వేడి పుట్టించేవారు. అశోక్ గజపతిరాజు కేంద్రమంత్రిగా ఉండటం.. ఆ సమయంలో జిల్లాపై ఆయన పెద్దగా దృష్టి పెట్టకపోవడంతో ఆ శిబిరంలోని నేతలంతా అడ్వాన్స్ అయ్యారట. గంటా వెళ్లిపోయాక అశోక్ చేతికి పగ్గాలు రావడంతో ఆ శిబిరంలోని టీడీపీ నేతలు సైలెంట్ అయ్యారు. వాళ్లంతా సమయం కోసం ఎదురు చూస్తున్న వేళ కొత్త పరిణామాలు తెరపైకి వచ్చినట్టు చెవులు కొరుక్కుంటున్నారు.ఏపీ టీడీపీ మాజీ అధ్యక్షుడు కళా వెంకట్రావు.. ఉమ్మడి జిల్లాపై ఫోకస్ పెట్టారట. ఇన్నాళ్లూ కామ్‌గా ఉన్న కాపు సామాజికవర్గం నాయకులంతా ఆయనతో టచ్‌లోకి వెళ్లారట. కిమిడి కుటుంబానికి ప్రాధాన్యం ఇచ్చి.. నాగార్జునను పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడిని చేయడం మొదలు పెట్టి.. నియోజకవర్గాల్లో అశోకవర్గానికి చెక్ పెడుతున్నారని ప్రచారం జరుగుతోంది. నెల్లిమర్ల, గజపతినగరం నియోజకవర్గాల్లో ఇంఛార్జులను నియమించకపోవడానికి ఆ వర్గపోరే కారణమని అభిప్రాయపడుతున్నారు.ఇక బాదుడే బాదుడు కార్యక్రమానికి విజయనగరం జిల్లాకు వచ్చిన చంద్రబాబుకు స్వాగతం పలకడంలోనూ టీడీపీలోని వర్గపోరు స్పష్టంగా కనిపించిందట. బాబుకు వెల్కమ్ చెప్పడానికి బస్సు దగ్గరకు అశోక్ ముందే చేరుకున్నారు. తర్వాత వచ్చిన కళా వెంకట్రావు.. అశోక్‌ను కలవకుండా మరో చోట కూర్చున్నారు. కళాను చూడగానే.. జిల్లా టీడీపీ నేతలు మెల్లగా ఆయన దగ్గరకు వెళ్లారు. వర్గపోరుతో సంబంధంలేని వాళ్లకు అక్కడేం జరుగుతుందో అర్థం కాలేదట. అశోక్, కళాలను ఇద్దరికీ నమస్కారం పెట్టి దూరంగా కూర్చున్నారట తటస్థ నాయకులు.మొత్తానికి 2014 ముందు వరకు జిల్లాలో ఒక్క మాటపై నడిచిన టీడీపీ.. వర్గాలుగా విడిపోయి చెరో శిబిరంలో చేరడం చర్చగా మారింది. దీనికంతటికీ అశోక్ ఒంటెద్దు పోకడలే కారణమని కొందరు..

# ఏపీ నుంచి  ఒకరికి మంత్రి పదవి

విజయవాడ, జూలై 9,నరేంద్ర మోడీ త్వరలో కేంద్ర మంత్రి వర్గాన్ని విస్తరిస్తారా? అలాంటి అవసరం, అవకాశం ఉన్నాయా? అంటే, ఉందనే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. నిజానికి ఢిల్లీ రాజకీయ వర్గాల్లో ఇప్పుడు ఇదే చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. కేంద్ర మంత్రులు ముక్తార్ అబ్బాస్ నఖ్వీ, ఆర్సీపీ సింగ్' రాజీనామా చేసిన నేపథ్యంలో, ఆ ఇద్దరి స్థానాలను భర్తీ చేయడంతో పాటుగా,రానున్న రోజులలో జరగనున్న గుజరాత్ సహా మరికొన్ని రాష్ట్ర శాసన సభ ఎన్నికలు, అదే విధంగా, 2024 లోక్ సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, కేంద్ర మంత్రి వర్గంలో మార్పులు చేర్పులకు అవకాశం ఉందని రాజకీయ. మీడియా వర్గాల్లో గత కొంత కాలంగా చర్చ జరుగుతోంది. అయితే, బీజేపీకి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ, జేడీ (యు)కు చెందిన ఆర్సీపీ సింగ్ తమ రాజ్యసభ సభ్యత్వ గడవు గురువారంతో ముగుస్తునందున, మంత్రి పదవులకు రాజీనామా చేసిన నేపథ్యంలో, మంత్రివర్గ విస్తరణ చర్చ మరో మారు ప్రముఖంగా తెర మీదకు వచ్చింది. అయితే, మంత్రి వర్గ విస్తరణ ఇప్పటికిప్పుడు ఉండే అవకాశం అయితే లేదని, జూలై 18 నుంచి మొదలయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు, రాష్టపతి, ఉప రాష్టపతి ఎన్నికలు ముగిసిన తర్వాత ఆగష్టు రెండవ వారం తర్వాత ఎప్పుడైనా మంత్రివర్గ విస్తరణ ఉండే అవకాశం ఉందని విస్వసనీయవర్గాల ద్వారా తెలుస్తోంది. అందుకే, ఇద్దరు మంత్రుల రాజీనామను ఆమోదించిన రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్, నఖ్వీ స్థానంలో ఆయన నిరహిస్తున్న మైనారిటీ సంక్షేం శాఖను, కేంద్రమంత్రి స్మృతీ ఇరానీకి, ఆర్పీ సింగ్ నిర్వహించిన ఉక్కు శాఖ బాధ్యతలను, జ్యోతి రాదిత్య సింధియా అదనపు బాధ్యతలుగా అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నఖ్వీ రాజీనామాతో, కేంద్ర మంత్రివర్గంలో ముస్లింలకు ప్రాతినిధ్యం లేకుండా పోయింది. కేంద్ర మంత్రి వర్గంలో ముస్లింలకు ప్రాతినిధ్యమే లేని పరిస్థితి, బహుశా దేశ చరిత్రలో ఇదే తొలిసారి కావచ్చని, రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అలాగే, సుమారు 400 మంది వరకు ఉన్న బీజేపీ ఉ భయ సభల ఎంపీలలోనూ ఒక్క ముస్లిం కూడా లేరు. అయితే, నఖ్వీని ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా నిలిపే అవకాశం ఉందని అంటున్నారు. ఉ పరాష్ట్రపతి ఎన్నిక ఆగష్టు 6న జారుతుంది. నఖ్వీ రాజ్య సభ సభ్యత్వ పదవీ కాలం ముగుస్తున్నందున ఒకటి రెండు రోజుల్లో, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశంలో ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా నఖ్వీ పేరును ప్రకటించవచ్చని అంటున్నారు. నఖ్వీ రాజీనామాకు ముందు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డను కలవడంతో , ఆయనే ఉప రాష్ట్రపతి అభ్యర్థి అనే ఊహగానాలకు మరింత బలం చేకూరింది. రాష్టపతి కోటా రాజ్యసభ సభ్యులుగా దక్షిణాది రాష్ట్రాలకు చెందిన నలుగురికి అవకాశం కలిపించడంతో, బీజేపీ దక్షణాది రాష్ట్రాలపై గట్టిగా దృష్టి పెట్టిందని, మరోమారు స్పష్టం అయ్యిందని అంటున్నారు. సో .. మంత్రి విస్తరణలోనూ దక్షణాది రాష్ట్రాలకు ముఖ్యంగా ఉభయ తెలుగు రాష్ట్రాలకు అవకాశం ఉంటుందని అంటున్నారు. ఆంధ్ర ప్రదేశ్ నుంచి దగ్గుబాటి పురందేశ్వరి,జీవీఎల్ నరసింహారావుకు అవకాశం ఉంటుందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే పురందేశ్వరికి రాష్ట్ర పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించే అలోచన కూడా ఉందని అంటున్నారు. అలాగే, మెగా స్టార్ చిరజీవి పేరు కూడా పరిశీలనలో ఉందని అంటు న్నారు.తెలంగాణ నుంచి లక్ష్మణ్ తో పాటుగా, త్వరలో బీజేపీలో చేరనున్న మరో కీలక నేత పేరుపరిశీలనలో ఉండవచ్చని అంటున్నారు. మంత్రివర్గ విస్తరణకు సంబంధించి ఇంతవరకు అధికారకంగా ఎలాంటి సమాచారం లేదు. నాలుగు రోజులు అటూ ఇటుగా అయినా కేంద్ర మంత్రివర్గ విస్తరణ అనివార్యంగా ఉంటుందని రాజకీయ పండితులు జోస్యం చెపుతున్నారు.

# తిరుపతి వైసీపీలో అసమ్మతి సెగలు

తిరుపతి, జూలై 9, నగరి వైసీపీ రాజకీయాలు మళ్లీ వేడెక్కాయి. మంత్రి రోజాపై? వైసీపీలోని ఆమె వ్యతిరేక వర్గం మళ్లీ కత్తులు దూస్తోంది. కొద్దిరోజులుగా సైలెంట్ అయ్యి కొత్త చర్చకు దారితీసిన వాళ్లంతా పాత పద్ధతిలోకి వచ్చేశారు. సై అంటే సై అంటున్నారు. తాడో పేడో తేల్చుకుంటామని సవాళ్లు విసురుతున్నారు. రోజా మంత్రి అయినా వెనక్కి తగ్గేదే లేదన్నట్టుగా మాటల తూటాలు పేల్చుతున్నారు అసమ్మతి నేతలు.2014లో నగరి నుంచి రోజా ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ సమయంలో ప్రతిపక్ష పాత్రకే పరిమితం. 2019లో రెండోసారి గెలిచి వైసీపీ అధికారంలోకి వచ్చినా.. ఆమెకు అసమ్మతి రూపంలో నేతలు ఉక్కిరి బిక్కిరి చేస్తున్న పరిస్థితి. గత ఎన్నికల సమయంలో మొదలైన విభేదాలు.. తర్వాత పంచాయితీ, పరిషత్, మున్సిపల్ ఎన్నికల్లోనూ కనిపించాయి. రోజాకు వ్యతిరేకంగా కేజే కుమార్, అమ్ములు, రెడ్డివారి చక్రపాణిరెడ్డి వంటి వైసీపీ నేతలు చాలా యాక్టివ్‌గా నగరిలో పనిచేస్తున్నారు. వీళ్లకు మంత్రి పెద్దిరెడ్డి తదితరుల అండ ఉందనేది రోజా వర్గం అనుమానం.నగరిలో తనకు వ్యతిరేకంగా పనిచేస్తున్న వారికి ఎలాంటి పదవులు ఇవ్వొద్దని రోజా చెప్పినా.. ఫలితం లేకుండా పోయింది. చక్రపాణిరెడ్డి శ్రీశైలం ఆలయం ఛైర్మన్ అయితే.. కుమార్ భార్యకు నామినేటెడ్ పోస్టు ఇచ్చారు. అసమ్మతి వర్గాలకు సహకరిస్తే.. పార్టీ నుంచి సస్పెండ్ చేస్తానని రోజా పలుమార్లు హెచ్చరించినా.. నగరి వైసీపీలో పరిస్థితులు మారలేదు. ఇంతలో రోజా మంత్రి అయ్యారు. దాంతో అసమ్మతి వర్గం దారిలోకి వస్తుందని.. ఎక్కడి వాళ్లు అక్కడికి సర్దుకుంటారని చర్చ జరిగింది. దానికి తగ్గట్టుగానే రోజా మంత్రి అయిన నాటి నుంచి అసమ్మతి వాదుల ఉసే లేదు. వాళ్లంతా సైలెంట్ అయ్యారని భావించారంతా. కానీ.. సీన్ రివర్స్ నగరిలో జరిగిన వైసీపీ ప్లీనరలో తన జోలికి వస్తే బాక్సులు బద్దలు అవుతాయని పంచ్ డైలాగులు వేశారు రోజా. ఆ మాటలు మంట పుట్టించాయో ఏమో.. అసమ్మతి వర్గం ఒక్కసారిగా జూలు విదిల్చింది. తాము తగ్గేదే లేదన్నట్టుగా కేజే కుమార్ వర్గం ఢీ అంటే ఢీ అంటూ రోడ్డెక్కేసింది. మంత్రి రోజా అనుచరుడు బీడీ భాస్కర్, అసమ్మతి నేత కుమార్ వర్గాల మధ్య గొడవ జరిగింది. రోజా బ్యానర్లు కట్టిన చోటే అడ్డంగా కుమార్ వర్గం మరో బ్యానర్ కట్టడానికి చూడటంతో రచ్చ రచ్చ అయింది.నగరిలో వైసీపీ ప్లీనరీకి రాని అసమ్మతి నేతలు.. పలమనేరులో మంత్రి పెద్దిరెడ్డి నిర్వహించిన చిత్తూరు జిల్లా వైసీపీ ప్లీనరీకి వెళ్లి.. మంత్రి రోజాకు షాక్ ఇచ్చారు. మొత్తానికి రోజాకు నగరి వైసీపీలో ఇంటిపోరు తగ్గేట్టు లేదు. మంత్రిగా ఉన్నా.. వాళ్లతో తలపోటులు తప్పడం లేదని అనుకుంటున్నారట. మరి.. ఈ సమస్యను అధిగమించడానికి.. అసమ్మతి వర్గానికి చెక్ పెట్టడానికి రోజా ఏం చేస్తారో చూడాలి.

# పాపం.. అచ్చెన్నాయుడు



శ్రీకాకుళం, జూలై 9,తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు. ఆయన తన సొంత జిల్లా శ్రీకాకుళంలో తప్ప ఎక్కడా పర్యటించలేని పరిస్థితి. రాష్ట్ర వ్యాప్తంగా మినీ మహానాడులను జరుపుతున్నారు. కానీ అందులో అచ్చెన్నాయుడుకు మాత్రం స్థానం లేదు. జాతీయ అధ్యక్షుడిగా ఉన్న చంద్రబాబు హాజరవుతున్నారు కదా? ఇక రాష్ట్ర అధ్యక్షుడు ఎందుకు అని అనుమానం రావచ్చు. కానీ జిల్లాల పర్యటనలను అచ్చెన్నాయుడును దూరంగా ఉంచుతున్నారన్న టాక్ నడుస్తుంది. కేసులో అరెస్ట్ అయి.. అచ్చెన్నాయుడు అప్పుడు ఈఎస్ఐ స్కాంలో అరెస్ట్ కాకపోతే అధ్యక్షుడు అయ్యేవారు కాదన్నది పార్టీలోనే అందరూ అంగీకరించే విషయం. బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని భావించి అప్పటి వరకూ ఆ పదవిలో ఉన్న కళా వెంకట్రావును తప్పించి అచ్చెన్నాయుడుకు ఇచ్చారు. నిజానికి లోకేష్ కు ఆ పదవిని అచ్చెన్నాయుడుకు ఇవ్వడం ఇష్టంలేదు. బీద రవిచంద్ర పేరు లోకేష్ సూచించినా కేసుల్లో అరెస్టయిన అచ్చెన్నాయుడును టీడీపీ అధ్యక్షుడిని చేస్తే రాజకీయంగా మైలేజీ వస్తుందని చంద్రబాబు భావించారు.అయితే అచ్చెన్నాయుడు తిరుపతి ఉప ఎన్నిక సందర్భంగా చేసిన వ్యాఖ్యలతో ఆయనను పార్టీ అధినేత పూర్తిగా పక్కన పెట్టింది. చంద్రబాబు మినీమహానాడుకు హాజరవుతున్నారు. పోనీ అక్కడ అచ్చెన్నాయుడుకు అవకాశం ఇవ్వలేదనుకుందాం. కానీ నియోజకవర్గాల సమీక్షల్లోనైనా అచ్చెన్నాయుడుకు ప్రాధాన్యత ఇవ్వాలి కదా? అన్న చర్చ జరుగుతోంది. మినీ మహానాడుల పేరుతో జిల్లాలకు వెళుతున్న చంద్రబాబు అక్కడ నియోజకవర్గాల వారీగా సమీక్ష కూడా నిర్వహిస్తున్నారు.నో డౌట్.. చంద్రబాబు డెసిషన్ ఫైనల్. ఆయన సమీక్ష చేస్తారు. నిర్ణయాలు తీసుకుంటారు. కానీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా అచ్చెన్నాయుడికి నియోజకవర్గ వేదికలపై చోటు కల్పించకపోవడంపై పార్టీలోనే చర్చ జరుగుతుంది. అచ్చెన్నను ఒక జిల్లాకు పరిమితం చేయడం మినహా మరేదీ చేయడం లేదు. మొన్న మోదీ సభకు భీమవరం పంపినా అది చంద్రబాబుకు ఆహ్వానం లేకనే. అందుకే అచ్చెన్నాయుడు పార్టీ అధినాయకత్వంపై ఒకింత ఆగ్రహంతో ఉన్నారని తెలిసింది. కానీ వేరే దారిలేదు. కళా వెంకట్రావు మాదిరి సర్దుకుపోతేనే బెటర్ అన్న అభిప్రాయానికి వచ్చారని తెలిసింది. మొత్తం మీద అచ్చెన్నను పార్టీ అవమానిస్తుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

# భరోసా ఇస్తున్న ఆర్బీకేలు

కర్నూలు, జూలై 9, ఇప్పటికే ఎన్నో సేవలు అందిస్తున్న ఆర్‌బీకేలు.. మరో సేవకు సిద్ధమయ్యాయి. ఇకపై పల్లెల్లో అత్యవసర సమయంలో ఆర్థిక అవసరాలనూ తీర్చనున్నాయి. అందులో భాగంగా బ్యాంక్‌లు, ఏటీఎంల పాత్రలను పోషించనున్నాయి. తక్షణ అవసరం నిమిత్తం రూ.20 వేల వరకు సమకూర్చేందుకు జగనన్న ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ ఏర్పాటు ప్రధానంగా రైతుల కోసం చేసినా ప్రజలు కూడా సద్వినియోగం చేసుకునే వెసులు బాటూ కల్పించడంతో అన్ని వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.అన్నదాతకు వెన్నుదన్నుగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. మరో అడుగు ముందుకేసి ఆర్థిక సేవలనూ వారి ముంగిట్లోకే తెచ్చింది. రైతు భరోసా కేంద్రాల్లో ఇప్పటి వరకు అందుతున్న సేవలతో పాటు బ్యాంకు సేవలనూ ప్రవేశపెట్టింది. పల్లె రైతులు, ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లకుండా అవసరమైనప్పుడు ఆర్థిక లావాదేవీలు నిర్వహించుకునే విధంగా ఏర్పాట్లు చేసింది. అందుకు ఉమ్మడి జిల్లాల్లో ఉన్న 874 రైతు భరోసా కేంద్రాల్లో బ్యాంక్‌ల సాయంతో 587 మంది బిజినెస్ కరస్పాండెంట్లను నియమించింది. వీరి ద్వారా రైతులకు అవసరమైన చిన్నచిన్న లావాదేవీలను బ్యాంకుల వద్దకు వెళ్లకుండా పూర్తి చేస్తోంది.సాధారణంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) నిబంధనల ప్రకారం 5 వేల జనాభా ఉన్న ప్రతి గ్రామంలో బ్యాంకు బ్రాంచ్ ఏర్పాటు చేయాలి. కానీ బ్యాంకుల విలీనంతో కొత్త బ్రాంచ్‌లు ఏర్పాటు చేసే అవకాశాలు లేకపోయినా బిజినెస్ కరస్పాండెంట్ల ద్వారా రైతులు, పల్లె ప్రజల అవసరాలను తీర్చనుంది. 587 మంది బిజినెస్ కరస్పాండెంట్లు నంద్యాల, కర్నూలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 874 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వాటిలో రైతులు ఆర్థిక లావాదేవీలు నిర్వహించుకునేందుకు వివిధ బ్యాంకులకు చెందిన 587 మంది బిజినెస్ కరస్పాండెంట్లను ఏర్పాటు చేశారు. వీరు జిల్లా వ్యాప్తంగా ఉన్న 2.47 లక్షల మంది రైతులతోపాటు ప్రజలకు కూడా ఈ సేవలు అందిస్తారు.ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంతో పాటు ఇప్పటికే ఎన్నో సేవలు అందిస్తున్న ఆర్‌బీకేలు.. మరో సేవకు సిద్ధమయ్యాయి. ఇకపై పల్లెల్లో అత్యవసర సమయంలో ఆర్థిక అవసరాలనూ తీర్చనున్నాయి. అందులో భాగంగా బ్యాంక్‌లు, ఏటీఎంల పాత్రలను పోషించనున్నాయి. తక్షణ అవసరం నిమిత్తం రూ.20 వేల వరకు సమకూర్చేందుకు జగనన్న ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ ఏర్పాటు ప్రధానంగా రైతుల కోసం చేసినా ప్రజలు కూడా సద్వినియోగం చేసుకునే వెసులు బాటూ కల్పించడంతో అన్ని వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## పేదలకు విద్యను దూరం చేసే జీవో 117 వెంటనే రద్దు చేయలి

### జిల్లా టీఎన్ఎస్ఎఫ్ మహేష్ యాదవ్

ఏలూరు జీవో నెంబర్ 117 ను రద్దు చేయాలని కోరుతూ ఏలూరు జిల్లా టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి జీవో ప్రతులను తగలబెట్టారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు పెనుబోయిన మహేష్ యాదవ్ మాట్లాడుతూ 3 4 5 తరగతుల పాఠశాల విలీన ప్రక్రియను తక్షణం నిలిపివేయాలి. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థులు ముఖ్యంగా బాలికలు నష్టపోతున్నారు. జగన్ రెడ్డి పాలనలో విద్యా వ్యవస్థ నిర్వీర్యమైపోయింది. ఏపీలో విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కారు. విద్యాహక్కు చట్టం ప్రకారం స్టూడెంట్ టీచర్ రేషియో పాటించకుండా విద్యావ్యవస్థను నాశనం చేస్తున్నారు. విలీనం పేరిట రాష్ట్రంలో గ్రామాల్లోని పాఠశాలలో దాదాపుగా ఎనిమిది వేల పాఠశాలలను మూసివేశారు. వాగులు వంకలు దాటి, జాతీయ రహదారులు దాటి పాఠశాలలకు వెళ్లి విద్యను అభ్యసించాలి అంటే విద్యార్థులకు చదువు దూరమయ్యే పరిస్థితి. జీవో నెంబర్ 117 ను తక్షణమే ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా భారీ ఉద్యమానికి పిలుపునిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీఎన్ఎస్ఎఫ్ నాయకులు గారపాటి సాయి, చంద్రబాబు, శేషు, పారేపల్లి పవన్, నాయుడు పవన్, మధ్యాహ్నపు సురేష్, చావాల సన్నీ, కృష్ణ, వెంకటరత్నం, భగవాన్, రవి చౌదరి తదితరులు పాల్గొన్నారు..

# టిడిపి రైతు పోరాటానికి పోలీసుల అడ్డంకులు



**రాత్రివేళ పరిటాల ఇంటి వద్ద పోలీసుల పహారా**

**రైతు సమస్యలు అక్రమ మైనింగ్ పై చలో గొందిరెడ్డిపల్లికి పిలుపునిచ్చిన మాజీ మంత్రి పరిటాల సునీత**

**శనివారం జరిగే కార్యక్రమానికి పోలీసుల అడ్డంకులు**

**ఇటు అనంతపురం.. అటు వెంకటాపురంలో పరిటాల ఇంటి వద్ద పోలీసుల పహారా**

**నిరసన కార్యక్రమానికి వెళ్లకూడదంటూ పోలీసుల నోటీసులు**

**పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్**

అనంతపురం రైతు సమస్యలు, అక్రమ మైనింగ్ పై టిడిపి చేపట్టిన చలో గొందిరెడ్డిపల్లి కార్యక్రమానికి పోలీసులు రాత్రి నుంచి అడ్డంకులు సృష్టించారు. వ్యవసాయ మోటార్లకు మీటర్ల బిగింపుతో పాటు గొందిరెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న ఎర్రమట్టి తవ్వకాలపై మాజీ మంత్రి పరిటాల సునీత ఆధ్వర్యంలో చలో గొందిరెడ్డిపల్లి కార్యక్రమానికి పిలుపునిచ్చారు. శనివారం రోజు తలపెట్టిన ఈ కార్యక్రమానికి టిడిపి నేతలు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉండటంతో పోలీసులు ముందస్తుగా అడ్డంకులు సృష్టించారు. రాత్రి 9 గంటల సమయంలో అనంతపురం తోపాటు వెంకటాపురంలో పరిటాల కుటుంబ సభ్యుల ఇంటి వద్దకు వచ్చి నిరసనకు వెళ్లకూడదంటూ నోటీసులు ఇచ్చారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తాము పోరాటం చేస్తుంటే పోలీసులు అడ్డంకులు సృష్టించడం సరైన చర్య కాదని.. ఈ సందర్భంగా మాజీ మంత్రి పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము శాంతియుతంగా నిరసన తెలిపేందుకు మాత్రమే వెళుతున్నామని ఎలాంటి ఆందోళనలు చేయడం లేదని చెప్పినప్పటికీ పోలీసులు వినలేదు. దీనికి తోడు ఇంటి వద్ద పోలీసుల పహారా కూడా ఏర్పాటు చేయడంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతులతో పాటు అన్ని వర్గాల వారు వ్యవసాయ మోటార్లకు మీటర్ల బిగింపు విధానాన్ని వ్యతిరేకిస్తున్నా కూడా మీటర్లు భిగిస్తామని మొండిగా ప్రభుత్వం మొండి గా వెళ్తుందన్నారు. దీనికి తోడు అక్రమ మైనింగ్ పై తమ అనేక సార్లు ఫిర్యాదులు చేసిన ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పుడు వైసీపీ నేతల ప్రోత్బలంతో మమ్మల్ని అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పోలీసులు ఎన్ని అడ్డంకులు సృష్టించిన తాము గొందిరెడ్డిపల్లికి వెళ్లి తీరుతామని వారు స్పష్టం చేశారు...

# రెండేళ్ల తరువాత మాడ వీధుల్లో శ్రీవారి బ్రహ్మోత్సవ వాహనసేవలు

**ఆగస్టు 1 నుండి అఖండ హరినామ సంకీర్తన పునఃప్రారంభం**

తిరుమల, జులై 09తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబరు 27 నుండి అక్టోబరు 5వ తేదీ వరకు జరుగనున్నాయని, కరోనా అనంతరం రెండేళ్ల తరువాత మాడ వీధుల్లో వాహనసేవలు నిర్వహించి భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తామని టిటిడి ఈఓ ఎవి.ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఈవో భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆ వివరాలు ఇవి.– శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సెప్టెంబరు 27న సాయంత్రం 5.45 నుండి 6.15 గంటల మధ్య మీన లగ్నంలో ధ్వజారోహణం జరుగనుంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.– బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా అక్టోబరు 1న గరుడ వాహనం, 2న స్వర్ణరథం, 4న రథోత్సవం, 5న చక్రస్నానం జరుగనున్నాయి.– కరోనా కారణంగా తిరుమలలో కొంత కాలం పాటు నిలిచిపోయిన అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమం ఆగస్టు 1వ తేదీ నుండి తిరిగి ప్రారంభంకానుంది. వివిధ ప్రాంతాల నుండి జానపద కళాకారులు విచ్చేసి అన్నమయ్య, త్యాగయ్య తదితర వాగ్గేయకారుల భజనలు, కీర్తనలు ఆలపిస్తారు.చిన్నపిల్లల హృదయాలయ– గతేడాది అక్టోబర్ 11న ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి చేతులమీదుగా తిరుపతిలో ప్రారంభించిన శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయలో ఇప్పటివరకు 490 ఓపెన్ హార్ట్ సర్జరీ చేయడం జరిగింది. ఇక్కడి డాక్టర్లు అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ఇటీవల 7 రోజుల పసికందుకు విజయవంతంగా గుండె శస్త్రచికిత్స చేశారు. ఇక్కడ ఉచితంగా వైద్య సేవలు అందించడం జరుగుతోంది. – అదేవిధంగా, చిన్నపిల్లలకు సంబంధించిన అన్ని రకాల వ్యాధులకు ఉత్తమ వైద్యం అందించేందుకు రెండు సంవత్సరాల్లో శ్రీ పద్మావతి పీడియాట్రిక్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేస్తాం.శ్రీ వకుళమాత ఆలయ మహాసంప్రోక్షణ– తిరుపతి సమీపంలోని పాతకాల్వ వద్ద పేరూరు బండపై నిర్మించిన శ్రీవకుళమాత ఆలయంలో జూన్ 23న మహాసంప్రోక్షణ నిర్వహించి భక్తులకు దర్శనం ప్రారంభించాం. ముఖ్యమంత్రి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.అమెరికాలో శ్రీనివాస కల్యాణాలు– అమెరికా దేశంలో స్థిరపడిన తెలుగువారి కోసం ముఖ్యమంత్రి ఆదేశం మేరకు జూన్ 18 నుంచి జూలై 9వ తేదీ వరకు ఎనిమిది నగరాల్లో శ్రీనివాస కల్యాణాలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటి(ఎపిఎన్‌ఆర్‌టిఎస్) సహకారంతో ఈ కల్యాణాలు చేపట్టడం జరిగింది.– జూన్ 18న శాన్‌ఫ్రాన్సిస్కో, 19న సియాటెల్, 25న డల్లాస్, 26న సెయింట్ లూయిస్, 30న చికాగో, జులై 2న న్యూ ఆర్లిన్, 3న వాషింగ్టన్ డిసి, 9న అట్లాంటా నగరాల్లో శ్రీవారి కల్యాణాలు జరిగాయి.షోడశదినాత్మక అరణ్యకాండ పారాయణ దీక్ష– సృష్టిలోని జీవరాశులు సుభిక్షంగా ఉండాలని, సకల కార్యాలు సిద్ధించాలని శ్రీవారిని ప్రార్థిస్తూ షోడశదినాత్మక అరణ్యకాండ పారాయణ దీక్ష చేపట్టాం. జూన్ 25న ప్రారంభమైన ఈ దీక్ష జులై 10న పూర్ణాహుతితో ముగియనుంది.– అరణ్యకాండలోని మొత్తం 75 సర్గల్లో గల 2,454 శ్లోకాలను 16 మంది ఉపాసకులు 16 రోజుల పాటు అత్యంత దీక్షాశ్రద్ధలతో పారాయణం చేస్తున్నారు.– వసంత మండపంలో శ్లోక పారాయణంతోపాటు ధర్మగిరి వేద పాఠశాలలో మరో 16 మంది ఉపాసకులు 16 రోజుల పాటు జప, తర్పణ, హోమాదులు నిర్వహిస్తున్నారు.ప్రకృతి వ్యవసాయ రైతుల నుండి 12 రకాల ఉత్పత్తుల సేకరణ– గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో తిరుమల శ్రీవారికి నైవేద్యం, ఇతర ప్రసాదాలు తయారుచేసేందుకు వీలుగా రెండో విడతలో 12 రకాల ఉత్పత్తులు సేకరించేందుకు రాష్ట్ర రైతు సాధికార సంస్థ, మార్క్‌ఫెడ్‌లతో ఒప్పందం చేసుకున్నాం.– తొలివిడతలో 500 మెట్రిక్ టన్నుల శనగలు కొనుగోలు చేశాం. ప్రస్తుతం బియ్యం, శనగలు, బెల్లం, కందిపప్పు, పెసలు, పసుపు, వేరుశనగ, మిరియాలు, ధనియాలు, ఆవాలు, చింతపండు, ఉద్దిపప్పు సేకరించాలని నిర్ణయించాం.– గో ఆధారిత ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు తిరుపతిలోని గోశాలను సంప్రదించి ఉచితంగా గోవులు, ఎద్దులను పొందవచ్చుతిరుమలలో..– జులై 17న తిరుమలలో ఆణివార ఆస్థానం జరుగనుంది.జూన్ నెలలో నమోదైన వివరాలు :దర్శనం :– శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య – 23.23 లక్షలుహుండీ :– హుండీ కానుకలు – రూ.123.74 కోట్లులడ్డూలు :– విక్రయించిన శ్రీవారి లడ్డూల సంఖ్య – 95.34 లక్షలుఅన్నప్రసాదం :– అన్నప్రసాదం స్వీకరించిన భక్తుల సంఖ్య – 50.61 లక్షలుకల్యాణకట్ట :– తలనీలాలు సమర్పించిన భక్తుల సంఖ్య – 11.61 లక్షలు

# సహచర ఉద్యోగినిపై అత్యాచారయత్నం

**అటవీశాఖ అధికారికి ఎనిమిదేళ్లు జైలు శిక్ష**

రాజమహేంద్రవరం సహచర ఉద్యోగినిపై అత్యాచారయత్నం చేసిన అటవీశాఖ అధికారికి ఎనిమిదేళ్లు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి పీఆర్ రాజీవ్ తీర్పునిచ్చారు. ప్రకాష్నగర్ పోలీసుల కథనం ప్రకారం.. 2017లో రాజమహేంద్రవరం ఏవీఏ రోడ్డులోని ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డివిజనల్ కార్యాలయంలో ఫారెస్ట్ ఆఫీసర్గా పనిచేసిన మల్లి వెంకటేశ్వరరావు తన కార్యాలయంలో ఉద్యోగినిపట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు ఎవ్వరూ ఆఫీసు లో లేని సమయంలో ఆమెపై అత్యాచారయత్నం చేశాడని బాధితురాలు ప్రకాష్నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై అప్పట్లో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన విచారణ జరిగింది. ఈ కేసులో వాదోపవాదాలు విన్న రాజమహేంద్రవరం 8వ అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టు న్యాయమూర్తి పీఆర్ రాజీవ్ తుది తీర్పును వెల్లడించారు. సెక్షన్ 354 ఐపీసీ కింద నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10వేలు

జరిమానా, సెక్షన్ 354–డి నేరానికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధించారు. మొత్తం 8 ఏళ్ల జైలు శిక్ష విధించారని పోలీసులు తెలిపారు. ఈ కేసు దర్యాప్తును అప్పటి సీఐ సుబ్రహ్మణ్యేశ్వరరావు చేశారు. పీపీగా ఎం.వెంకటేశ్వరావు వ్యవహరించారు. కోర్టు హెడ్ కానిస్టేబుల్ పి.కొండలరావు ఈ కేసు విచారణలో కృషిచేశారు

# ప్రజలకు ఇబ్బంది కలగ కుండా అన్ని జాగ్రత్తలు

హైదరాబాద్ జూలై 09 గత రెండు రోజుల నుండి ఏడతెరపి లేని వర్షాలు కురుస్తున్న నేపథ్యం లో నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి వెల్లడించారు.వర్షాల నేపథ్యం లో శనివారం మేయర్ పీకెట్ నాలా పై రసూల్ పూర మినిస్టర్ క్రాస్ రోడ్డు వద్ద యస్ యెన్ డి పీ ద్వారా చేపట్టిన రిమోడలింగ్ బ్రిడ్జి ఒక వైపు పూర్తయిన పనులను పరిశీలించారు. అక్కడ నుండి మేయర్ జి హెచ్ ఎం సి ప్రధాన కార్యాలయం లో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ సెంటర్ నీ పరిశీలించి వచ్చిన పిర్యాదుల పరిష్కారం పై ఓ యస్ డి అనురాధ ను అడిగి తెలుసుకున్నారు. మేయర్ గద్వాల్ విజలక్ష్మి కంట్రోల్ రూం లో వర్షపాతం పరిస్థితి, వచ్చిన ఫిర్యాదుల సంఖ్య, పరిష్కారం తీరుపై అరా తీశారు. జిహెచ్ఎంసి పరిధిలోని వివిధ ప్రాంతాల్లో కురిసిన వర్షపాతం, కంట్రోల్ రూం పనితీరు, ఫిర్యాదుల స్వీకరణతదుపరి సంబంధితశాఖకు తెలియజేసిన చర్యలు తీసుకుంటారనీ మేయర్ కు వివరించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిన్నటి నుంచి 1.5 నుంచి 6.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని, 383 ఫిర్యాదులు అందాయని, ఇప్పటి వరకు 375 పరిష్కరించామని, మిగిలిన 8 పూర్తయ్యే దశలో ఉన్నాయని తెలిపారు.197 చెరువుల వద్ద అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు మరియు సరస్సులలోకి నీటి ప్రవాహాన్ని పర్యవేక్షించడానికి బృందాలు నిమగ్నమై ఉన్నాయి, పరిస్థితి అవసరమైతే స్లూయిస్ గేట్లను ఎత్తి నీటిని తగ్గించడానికి చర్యలు తీసుకుంటారు. కాలానుగుణంగా వచ్చే వ్యాధులను నియంత్రించడానికి ఎంట మాలోజి విభాగం ఫాగింగ్, స్ప్రేయింగ్ మరియు లార్వా నిరోధక చర్యలను రుతుపవనాల కంటే ముందు నుండి కార్యకలాపాలను ఇప్పటికే చేపట్టిందన్నారు .జీహెచ్ఎంసీ అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటోందని, పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు మేయర్ తెలిపారు. సూచిక బోర్డులను జి హెచ్ ఎం సి ఏర్పాటు చేసిందని చెప్పారు ప్రతి పని వద్ద ఒక అధికారి నీ నియమిస్తూ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సూచిక బోర్డులను ఏర్పాటు చేశారని వివరించారుమొబైల్, మిని మొబైల్, స్తాటికల్ లాంటి మాన్సూన్ ఏమెర్జన్సీ టీమ్ లను ఏర్పాటు చేసి ఎప్పటి కప్పుడు నీట నిలిచిన ప్రాంతాల్లో తొలగించడం చర్యలు తీసుకొని ప్రజలకు ఇబ్బంది కలగ కుండా చర్యలు తీసుకుంటారని అన్నారు. మేయర్ కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్ 7వ లో ఉన్న సందర్శించి నగరంలో వర్షపాతం పరిస్థితిని చూశారు.పౌరులు తమ ఫి ర్యాదులను నమోదు చేసుకోవడానికి 040–21111111, 04029555500 నంబర్లలో సంప్రదించాలని మేయర్ తెలిపారు...

# డ్రైన్ లో పడి వ్యక్తి మృతి

నర్సాపురం పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం పట్టణంలోని శ్రీహరిపేటలో శుక్రవారం రాత్రి ఒక వ్యక్తి డ్రైన్ లో జారీ పడి మృతి చెందాడు. మున్సిపల్ అధికారులు డ్రైన్ ను ఓపెన్ గా వదిలేయడంతో డ్రైన్ లో పడిన వ్యక్తి పై మోటార్ సైకిల్ పడిపోవడంతో రాత్రి సమయంలో ప్రమాదం జరగడంతో ఎవరు చూడకపోవడంతో శనివారం ఉదయం గమనించిన స్థానికులు మున్సిపల్ సిబ్బంది కి సమాచారం ఇవ్వడంతో ఆ వ్యక్తి ని డ్రైన్ లో నుండి తీసినప్పటికి ఆ వ్యక్తి మృతి చెందిఉన్నాడు.దీనితో స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మృతి చెందిన వ్యక్తి నర్సాపురం మండల వేములదీవి కి చెందిన అడ్డాల రవి గా గుర్తించారు.మృతుడికి శుక్రవారం ఒక పాప పుట్టిందని తన సోదరి ఇంటికి వెళ్లేందుకు ఈ మార్గంలో వెళ్తుండగా డ్రైన్ పై ప్లేట్ లు లేకపోవడం వల్లే ఈ ప్రమాదం సంభవించినట్లు స్థానికులు చెప్తున్నారు.ఏది ఏమైనా మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఒక వ్యక్తి మృతి చెందాడు.

# జీవితంలో చూడలేదు

శ్రీనగర్ శుక్రవారం అమర్నాథ్ ప్రాతంలో వచ్చినలాంటి వరదలు నా జీవితంలో ఎప్పుడూ చూడలేదని బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. మిలిటరీ అధికారుల సేవల వల్లే ప్రాణనాష్టం ఎక్కువ జరగలేదు. గోషామహల్ ప్రజలు తెలంగాణ ప్రజల ఆశీర్వాదం వల్లే నేను నా కుటుంబం బతికి బయటపడ్డామని అయన అన్నారు. ప్రస్తుతం సేఫ్ గా శ్రీనగర్ ప్రాంతానికి మేము మా కుటుంబం చేరుకున్నాం. మిలిటరీ అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తూ ప్రాణా నష్టం ఎక్కువ జరగకుండా చూశారు. నేను బస చేసిన ప్రాంతం ప్రజలతో, మాట్లాడిన ప్రాంతం వరదతో ముంచెత్తింది. మేమున్న ప్రదేశానికి కేవలం కిలోమీటర్ దూరంలోనే వరదలు వచ్చాయని అన్నారు.

# ప్రజా సేవ చేయడానికి కారణాలు అవసరం లేదు

**-మంథని మున్సిపల్ ఛైర్మన్ పుట్ట శైలజ**

మంథని ప్రజా సేవ చేయడానికి ఎండ, వాన, చలి అంటూ కారణాలు అవసరం లేదని మంథని మున్సిపల్ చైర్మన్ శ్రీమతి పుట్ట శైలజ పేర్కొన్నారు. మంథని పట్టణం లో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకునేందుకు వర్షంలోనే మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ పట్టణంలో శనివారం పర్యటించారు. పలు వార్డుల్లో ఇంటింటికీ కాలి నడకన తిరుగుతూ ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అవసరం అయితనే బయటకి రావాలని సూచించారు. వర్షం లో తడిస్తే జ్వరం వస్తదని అలాగే ప్రతి ఒక్కరూ ఇంటి ముందు చెత్త ఉంచకుండా మున్సిపల్ బండి లో వేయాలని వర్షకాలం లో పలు జాగ్రత్తలు పాటించాలని కోరారు. అంతే కాకుండా వార్డుల్లో ఏ సమస్య ఉన్న మాకు తెలియజేయాలని అన్నారు. పలు వార్డుల్లో మురికి కాలువలను సిబ్బంది చే పరిశుభ్రం చేయించారు. ప్రజలకి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఎప్పటికప్పుడు తాను తమ సిబ్బంది అప్రమత్తంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్లు, పట్టణ మహిళ అధ్యక్షురాలు బుద్దర్తి రాణి, స్థానిక తెరాస నాయకులు కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండండి

**తాహాసిల్దార్ ప్రసాద్**

కమాన్ పూర్ కమాన్ పూర్ మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమాన్ పూర్ తహసిల్దార్ దత్తు ప్రసాద్ కోరారు. కమాన్ పూర్ మండలం లో రానున్న 48 గంటలలొ భారి నుండి అతి భారి వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కమాన్ పూర్ మండల ప్రజలకు అప్రమత్తంగా ఉంటూ, కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు పాటించగలరు. వర్షానికి తడిసిన విద్యుత్ స్థంబాలను, గోడలను తాకూడదు చెట్ల క్రింద ఉండరాదు, ఫోన్స్ ఉపయోగించరాదు ఇ) రైతులు బావులు, బోర్ ల వద్ద కరెంట్ పెట్టె ముందు తడిసిన స్టార్టర్ బాక్స్ లను, ఫ్యుజ్ బాక్స్ లను చేతులతో ముట్టుకోరాదు. వర్షానికి రోడ్లు కొట్టుకుపోయి, గుంతలు ఏర్పడి, అందులో నీరు నిల్వ ఉండి ఆ గుంతలు వాహనదారులకు కనిపించక ప్రమాదానికి గురి అయ్యి ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉంది. కావున కమాన్ పూర్ మండల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి× దయచేసి వర్షాలకు కల్వర్టు, చిన్న చిన్న బ్రిడ్జి ల వద్ద నీరు ప్రవహిస్తున్నపుడు వాహనాలతో దాటడానికి సాహసం చేయకండి.ఇట్టి పై విషయాలు గురించి కమాన్ పూర్ మండల ప్రజలందరూ ఈ వర్షా కాలం లో జాగ్రత్తలు పాటిస్తూ వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరడం జరిగింది.

# గంటిపెదపూడి లంకలో తెగిన తాత్కాలిక నదీపాయ గట్టు

కోనసీమ కొనసీమకు తాకిన వరద.. వి.గన్నవరం మండలం గంటిపెదపూడిలో నదీపాయలో వేసిన తాత్కాలిక గట్టు తెగిపోయింది. దాంతో నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గంటి పెదపూడి, బూరుగులంక, అరిగెల వారిపాలెం ,పెదలంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయింది. నాలుగు నెలల పాటు నాలుగు గ్రామాల ప్రజలు పడవపైనే ప్రయాణాలు చేయనున్నారు. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టలేదని గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులు ఇప్పటివరకు వరదలపై ఎలాంటి సమీక్ష సమావేశం నిర్వహించలేదని సమాచారం. మరింత వరద పెరిగితే కోనసీమలోని కనకాయలంక, అయినవిల్లి ఎదురు బిడియం కాజ్ వే ల పైకి వరద నీరుచేరే ప్రమాదం వుంది. ..

## కన్హయాలాల్ హత్యను బీజేపీ రాజకీయం చేస్తోంది

విశాఖపట్నంఉదయ్ పూర్ లో హత్యకు గురైన కన్హయాలాల్ కేసును బీజేపీ రాజకీయం చెస్తుందని కోరాపుట్ కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి అన్నారు.ఆ హత్య కేసులో ప్రధాన నింధుతుడిగా ఉన్న మహ్మద్ రిజాయ్ అథారి బీజేపీ సభ్యుడని,రాజస్థాన్ విధాన్ సభ అపోజిషన్ లీడర్ గుబాబ్ చంధ్ కటారియా అల్లుడు అతడ్ని బీజేపీలోకి తీసుకు వచ్చాడని అన్నారు.ఇటీవల అరెస్టు అయిన లష్కరే ఏ తోయిబా తాలీ హుస్సేన్ తో అమిత్ షా ఫోటో దిగారని,అమరావతిలో హత్యకు గురైన కేసులో నింధుతుడు అయిన వ్యక్తి బీజేపీకి మద్దతు ఇస్తున్న ఒ స్వతంత్ర ఎంపీ అనుచరుడని అన్నారు.నింధుతులు, టెరరిస్టులతో సంబంధం ఉన్న వాళ్లందరూ బీజేపీతో సంబంధం కలిగి ఉన్నారని,కాశ్మీర్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ నేతలు టెరరిస్టులకు సహాయం చెసిన వారికి టిక్కెట్లు ఇచ్చారని ఆరోపించారు.

## పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

### బక్రీద్ ను భక్తిశ్రద్ధలతో జరుపుకోండి సిఐ,

బద్వేలు పండగలను భక్తిశ్రద్ధలతో ఆయా మతాల వారు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ హనుమంత్ నాయక్ గారు తెలిపారు. శనివారం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటుచేసిన "ఫిస్" ( శాంతి) సమావేశంలో హిందూ, ముస్లిం మత పెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సి ఐ హనుమంత్ నాయక్ గారు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండగను శాంతియుతంగా జరుపుకొని మతసామరస్యాన్ని చాటాలన్నారు. ఏవైనా సంఘటనలు జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పుకార్లను నమ్మవద్దని సూచించారు. ఎవరీ మనోభావాలు దెబ్బ తినకుండా ఒకరినొకరు గౌరవించుకునేలా నడుచుకోవాలని కోరారు. బక్రీద్ పండగ సందర్భంగా చట్టాలను గౌరవిస్తూ పండగను జరుపుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటివరకు లౌకికవాదం ఉట్టి పడేలా పండగలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఇదే పద్ధతి కొనసాగిస్తూ ఒకరి పండగలను మరొకరు గౌరవించాలని కోరారు. ప్రశాంత వాతావరణంలో పండగను జరుపుకున్నప్పుడే లౌకికవాదం సాధ్యమవుతుందని తెలిపారు. పోలీసులకు అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో రూరల్ ఎస్సై చంద్రశేఖర్. గోపవరం మండలం కో ఆప్షన్ మాజీ సభ్యులు ఎస్ మస్తాన్ సాహెబ్. ఆవాస్ కమిటీ అధ్యక్షులు ఎస్ ఎ సత్తార్. ఆవాస్ కమిటీ డివిజన్ కార్యదర్శి ఎస్కే మస్తాన్. సలీం ఆఫీస్ సాబ్. జింక రవికుమార్. సివి సుబ్బారెడ్డి.. కరిముల్లా .ఖాజా గౌస్. చింతలచెరువు వెంకటసుబ్బయ్య. పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం వల్లే దళితుల పై దాడులు

బద్వేలు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వం రూలింగ్ లోకి వచ్చిన దగ్గర నుండి దళితులు పైన దాడులు హత్యలు అత్యాచారులు ఎక్కువయ్యాయని పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి తాలూకా అధ్యక్షుడు పిచ్చయ్య పేర్కొన్నాడు. బుధవారం నాడు స్థానిక అంబేద్కర్ భవనం దగ్గర విలేకరుల సమావేశంలో పిచ్చయ్య మాట్లాడుతూ ఇటీవల రావులపాలెం గ్రామంలో అంబేద్కర్ గారి బొమ్మను ప్లేట్లలో ముద్రించి విక్రయించడం, అడ్డుకున్న స్థానిక దళిత యువకుల పైన కేసులు పెట్టడం చాలా దుర్మార్గమైన చర్య అని, భారత రాజ్యాంగ నిర్మాత అయిన అంబేద్కర్ గారిని అవమానించడం క్షమించరాని నేరం అని, ఇప్పటికైనా రాష్ట్రంలో దళితులపై జరిగే దాడులను అరికట్టాలని అందుకు ప్రభుత్వాలు సహకరించి భారతరత్న అంబేద్కర్ గారిని అవమానించిన వారిపై కేసులు పెట్టి దళిత యువకులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆధునిక సమాజంలో కూడా కుల వివక్షతో అహంకారంతో మనిషిని మనిషిని గా చూడకుండా దళితులపై దాడులు చేయడం హేయమైన చర్యగా భావిస్తున్నానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చికామణి, సకల కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బద్వేల్ రవితేజ, పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి మండల అధ్యక్షుడు ప్రసాద్, హార్ట్ క్రాఫ్ట్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బద్వేలు చిన్న వెంకటయ్య ,దళిత నాయకులు యోహాన్, భాష తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలి

### క్లస్టర్, బూత్ కమిటీ సమావేశంలో సోమిరెడ్డి, బీద రవిచంద్ర, పోలం రెడ్డి

కొడవలూరు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి మాజీ శాసనసభ్యులు పోలం రెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో కోవూరు నియోజకవర్గం లోని పలు మండలాల్లో క్లస్టర్,యూనిట్,ఇంచార్జ్ మరియు బూత్ కన్వీనర్ ల ఎంపిక , సమావేశం స్థానికపిఎస్ ఆర్ కళ్యాణమండపం నార్త్ రాజుపాలెం లోపోలంరెడ్డిశ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన స్థానిక నాయకుల, కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పోలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి,జాతీయ ప్రధాన కార్యదర్శి బీదా రవిచంద్ర,రాష్ట్ర పరిశీలకులు కార్యదర్శి దశరదాచారి,రాష్ట్ర కార్యదర్శి కందుల నారాయణరెడ్డి,రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పోలంరెడ్డి ధినేష్ రెడ్డి లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలువురు రాజకీయ ప్రముఖులు మాట్లాడుతూ క్లస్టర్,యూనిట్,ఇంచార్జ్ మరియు బూత్ కన్వీనర్ ల ప్రాధాన్యత వివరించారు.తెలుగుదేశం పార్టీ రథానికి సారథులుగా అభివర్ణించారు.గతంలో జరిగిన మున్సిపల్ ,ఎమ్.పి.టి.సి.జెడ్.పి.టి.సి ఎన్నికల్లో బూతుకమిటిల నిర్వాహణ సరిగా లేనందున వైపాల్యాలకుదారితీసాయన్నారు.వైసీపీ పార్టీ కి వాలంటీర్లు బూతు కమిటీ లు గా వ్యవహరిస్తున్నారని అందుకే వాళ్ళు విజయం సాధిస్తున్నారన్నారుఅన్ని .అందుకని ప్రతి తెలుగుదేశం ఎన్నికల్లో కార్యకర్త స్థాయి నుంచి నాయకుల స్థాయి వరకు ప్రతి ఒక్కరు కష్టపడి నిబద్దతతోపనిచేయాలన్నారు.వైకాపా ప్రభుత్వం లో అవినీతి రాజ్యమేలుతుందన్నారు.సంక్షేమ పథకాల తో మభ్యపెట్టి పేదల రక్తాన్ని జే.బ్రాండ్ లిక్కర్ రూపంలో జగన్మోహన్ రెడ్డి పీలుస్తున్నారన్నారు.తెలుగుదేశం పార్టీ బలోపేతానికి అందరూ కలిసి కట్టుగా పని చేద్దామని, వైసీపీ అక్రమ కేసులకు భయపడేది లేదని కార్య కర్తలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రజలకు సంక్షేమం అభివృద్ధి చేయకుండా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేసి రాక్షస ఆనందం పొందుతున్నారన్నారని ఆయన ఎద్దేవా చేశారు, తాము అధికారంలోకి రాగానే ఎవరిది వారికి తీరిగి ఇచ్చేస్తామని తెలియజేశారు .రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తే కోర్టులను ఆశ్రయిస్తామన్నారు. పోలీసులు అధికార పార్టీకి కొమ్ము కాసి ఇబ్బం దులు తెచ్చుకోవద్దన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు చిన్నపాటి విభేదాలను పక్కన పెట్టి పార్టీని అధికారం లోకి తీసుకురావడానికి కృషి చేద్దామని జాతీయ ప్రధాన కార్యదర్శి బీదా రవిచంద్ర అన్నారు.ప్రజల్లో వైసీపీ పై ఉన్న వ్యతిరేకత ఆదారం చేసుకోకుండా పార్టీ కోసం శ్రమించి టిడిపి అధికారంలోకి వచ్చేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర,జిల్లా,నియోజకవర్గ, మండల ప్రధాన కమిటీ మరియు అనుబంధ సంఘాల సభ్యులు,వార్డ్ ఇంఛార్జి లు , బూత్ కన్వీనర్లు, క్లస్టర్ ఇంచార్జీలు, మరియు యూనిట్ ఇన్చార్జి లు, అయిదు మండల స్థాయి అధ్యక్షులు,నాయకులు వివిధ రంగాల పదవులు చేపట్టిన ముఖ్య నాయకులు, నియోజకవర్గం లో అన్ని మండలాల నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## జిల్లా ప్రజలకు బక్రీద్, తొలి ఏకాదశి శుభాకాంక్షలు....

కడప, మత సామరస్యానికి ప్రతీక అయిన వైఎస్ఆర్ జిల్లా ప్రజలకు సకల శుభాలతో పాటు ఆయురారోగ్యాలు అందాలని, అందరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని కోరుకుంటూ.. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.బి. అంజాద్ బాషా, జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఏకకాలంలో వచ్చిన బక్రీద్, తొలి ఏకాదశి పండుగ శుభాకాంక్షలు తెలియచేశారు. ముస్లిం సోదరులకు బక్రీద్ పర్వదినం, హిందువులకు తొలి ఏకాదశి పండుగలు.. అత్యంత భక్తి, ప్రీతికరమైనవని.. ఒకే రోజు ఈ రెండు పండుగలు రావడం విశేషం అన్నారు. ముస్లిం ఆరాధ్య గ్రంథం దివ్యఖురాన్ ప్రకారం సమాజంలో పేరుకుపోతున్న రుగ్మతలనుంచి మానవాళిని జాగృత పరుస్తూ సన్మార్గంలో నడిపించేందుకు అల్లాహ్ పంపిన ప్రవక్తల్లో ఒకరైన హజరత్ ఇబ్రహీం త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకునే పండుగ బక్రీద్ అన్నారు.ఎంతో పవిత్రంగా జరుపుకునే ఈ పండుగ దానగుణానికి, త్యాగానికి ప్రతీక అన్నారు. ఏడాది పొడవునా ఉండే 24 ఏకాదశుల్లో ఆషాఢ శుక్ల ఏకాదశి తొలి ఏకాదశిగా పరిగణిస్తారు. ఈ రోజు నుంచి ప్రతి వారానికి, పదిహేను రోజులకోసారి హిందువుల పండుగలు ప్రారంభమవుతాయని.. పండుగలకు శుభారంభాన్నిచ్చే ఈ తొలిఏకాదశి పండుగ హిందువులకు ఎంతో భక్తి ప్రధానమైనదని... ఈ పండుగలు ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషాన్ని నింపాలని ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా ఆకాంక్షించారు.× శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ పర్వదినాల సందర్భంగా జిల్లా ప్రజలందరికీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషాతో పాటు.. జిల్లా ఇంచార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, జడ్పి చైర్మన్ అమర్ నాథ్ రెడ్డి, మేయర్ సురేష్ బాబు, ఎంఎల్ సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు, ఎస్పీ కేకేఎన్ అన్బు రాజన్, జేసీ సాయికాంత్ వర్మ తదితరులు శనివారం ఒక ప్రకటనలో బక్రీద్, తొలిఏకాదశి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కోవిడ్ నిబంధనలను అనుసరించి బక్రీద్ పండుగను నిర్వహించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు మాస్కులు ధరించి భౌతిక దూరం పాటిస్తూ ప్రజారోగ్యానికి భంగం కలుగకుండా ప్రశాంతంగా ప్రార్ధనలు జరుపుకోవాలని ఆ ప్రకటనలో వారు కోరారు.

## సి ఐ టి యు నూతన కమిటీ ఎన్నిక

రైల్వే కోడూరు ఆంధ్రప్రదేశ్ ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ సి ఐ టి యు అనుబంధ నూతన కార్యవర్గం అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరులో ఏకగ్రీవంగా,ఎన్నుకున్నట్లు సిఐటియు జిల్లా కార్యదర్శి సి హెచ్ చంద్రశేఖర్ ప్రకటించారు. గౌరవ అధ్యక్షులుగా తుపాకుల హరిప్రసాద్, అధ్యక్షులుగా సి. ముని చంద్ర రాజు, ప్రధాన కార్యదర్శిగా ఎం నారాయణ, ఉపాధ్యక్షులుగా, ఏన్.శివయ్య, సి .ప్రసాద్, ఎస్ అనురాధ, సహాయ కార్యదర్శులు గా, ఓ. రవి, యన్. నాగేశ్వరయ్య, ఎస్. సుగుణ, కోశాధికారిగా ఓబిలి.సుధాకర్లను ఎన్నుకోవడం జరిగింది వీరితో పాటు కమిటీ సభ్యులుగా, జి వెంకట సుబ్బయ్య, ఓ. వెంకట్ రాయలు,జి ప్రసాద్, యన్ .సుజాత, హైమావతి, ఈశ్వరమ్మ వనజాక్షి, తదితరులను ఎన్నుకున్నట్లు చంద్రశేఖర్ ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధి హామీ చట్టాన్ని, సిపిఎం వామపక్షాల ఉద్యమంతో సాధించడం జరిగిందని, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్ర జరుగు తుందనిదాన్ని తిప్పికొట్టాల నిపిలుపునిచ్చారు , ఫీల్డ్ అసిస్టెంట్ లకు కనీస వేతనం 24000 ఇవ్వాలని డిమాండ్ చేశారు, మాన్ డేస్ తోసంబంధం లేకుండా వేతనం ఇవ్వాలని కోరారు. ఇన్చార్జిల పేరుతో, ఫీల్డ్ అసిస్టెంట్లులను, తొలగించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచిస్తున్నా యని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కి బడ్జెట్లో 25 లక్షల కోట్లు కోత విధించి కుదించారని, గుర్తు చేశారు. కూలీలకు వేసవి లో ఇచ్చే సమ్మర్ వేతనం తొలగించడం అందులో భాగమే అన్నారు. కూలీల వేతనం 257 కి సీలింగ్ పెట్టడం వల్ల, ఉపాధి కూలీలు పని కూడా ఆసక్తి చూపడం లేదన్నారు. కనీస వేతనం కేరళ మాధురి రోజుకు 600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు ఉపయోగపడే పనులు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు, ఐక్యంగా ఉపాధి చట్టం పరిరక్షణ కోసం, మెరుగైన కూలి, వేతనం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

## నేడు శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామి వార్ల కళ్యాణ మహోత్సవ వేడుకలు.

నెల్లూరు నెల్లూరు గ్రామీణ నియోజవర్గ వర్గం పరిధిలోని కనుపర్తిపాడు గ్రామంలో వెలసియున్న శ్రీ శ్రీ శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శ్రీ స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 4న సోమవారం నుండి అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగానే శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వార్ల కళ్యాణ మహోత్సవ వేడుకలకు ఉభయ కర్తలుగా దువ్వూరు వెంకటేష్ రెడ్డి- పద్మావతి, దువ్వూరు రామ్ చరణ్ రెడ్డి- కావ్య, బల్లెల శ్రీధర్ రెడ్డి - సుజిత వ్యవహరిస్తారని ఆలయ శాశ్వత ధర్మకర్త వెందోటి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వార్ల బ్రహ్మోత్సవాలు ఉభయ కర్తల సంయుక్త ఆధ్వర్యంలో 11 రోజులుగా అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కార్యనిర్వాహణ ప్రణాళికను ఏర్పాటు చేయబడిందని తెలిపారు. అందులో భాగంగానే ఈనెల 4న సోమవారం ఓరుగంటి రామసుబ్బయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఓరుగంటి వెంకట సుబ్రహ్మణ్య సునీల్ కుమార్, వెంకట సుబ్రహ్మణ్య రాఘవేంద్ర కుమార్ లు వారి వారి సతీ సమేతంగా స్వామివారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయబడిందని తెలిపారు.


## అండర్ వాటర్ లో రణ్ బీర్ – వాణీ సయ్యాట!




బాలీవుడ్ నుంచి వస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'షంషేరా'. కరణ్ మల్హోత్రా దర్శకత్వం వహించారు. యష్ రాజ్ ఫిలింస్ బ్యానర్ పై పాపులర్ ప్రొడ్యూసర్ ఆదిత్య చోప్రా అత్యంత భారీ స్థాయిలో నిర్మించారు. వాణీ కపూర్ హీరోయిన్ గా నటించిన ఈ మూవీని హిందీ తెలుగు తమిళ భాషల్లో విడుదల చేయబోతున్నారు. 1800 సంవత్సరం నేపథ్యంలో సాగే సినిమా ఇది. ఇందులో బందిపోటు గానూ మరో పాత్రలోనూ రణ్ బీర్ కపూర్ కనిపించబోతున్నారు.ఇటీవల విడుదల చేసిన రణ్ బీర్ కపూర్ లుక్ అతని మేకోవర్ పలువురిని షాక్ కు గురిచేసింది. ప్రస్తుతం పాన్ ఇండియా సినిమాల జోరు కనిపిస్తున్న నేపథ్యంలో ఈ మూవీని కూడా అదే పంథాలో భారీ బడ్జెట్ తో నిర్మించారు. ఇటీవల విడుదల చేసిన ఈ మూవీ ట్రైలర్ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. సినిమాపై అంచనాల్ని పెంచేసింది. గత కొంత కాలంగా సౌత్ లో పాగా వేయాలని ప్లాన్ చేస్తున్న బాలీవుడ్ మేకర్స్ ఈ ఈ మూవీని ప్రధాన అస్త్రంగా చేసుకోబోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి.సంజయ్ దత్ బ్యాడ్ మెన్ గా నటించిన ఈ మూవీలోని ఇతర పాత్రల్లో రోనిత్ రాయ్ అశుతోష్ రాణా సౌరభ్ శుక్లా త్రిధా చౌదరి పితో బాష్ త్రిపాఠి నటించారు. మిథున్ సంగీతం అందించిన ఈ మూవీని జూలై 22న హిందీతో పాటు తెలుగు తమిళ భాషల్లో ఏక కాలంలో రిలీజ్ చేయబోతున్నారు. స్వాతంత్ర్యం కోసం ఓ బందిపోటు బ్రిటీష్ సామ్రాజ్యంపై ఎలా తిరుగుబాటు చేశాడు.. ఈ క్రమంలో ఎలాంటి సవాళ్లని ఎదుర్కొన్నడనే ఆసక్తికరమైన కథతో ఈ మూవీని తెరకెక్కించారు.తాజాగా విడుదల చేసిన ఈ మూవీలోని విజువల్స్ సినిమాపై అంచనాల్ని పెంచేశాయి. సినిమా రిలీజ్ కి మరో రెండు వారాలు మాత్రమే వున్న నేపథ్యంలో మ్యూజికల్ వీడియోలని విడుదల చేయడం మొదలు పెట్టింది.ఇప్పటికే ఫస్ట్ సింగిల్ ని విడుదల చేసిన మేకర్స్ గురువారం సెకండ్ సింగిల్ గా లవ్ సాంగ్ 'ఫితూర్' కి సంబంధించిన వీడియోని విడుదల చేసింది. ఇదే సందర్భంగా తెలుగు సాంగ్ ని కూడా రిలీజ్ చేసింది. 'నీ పైన పిచ్చి ప్రేమే కదా..' అంటూ చైతన్య ప్రసాద్ రాసిన పాటని విడుదల చేశారు. అండర్ వాటర్ లో హీరోయిన్ వాణి కపూర్ రణ్ బీర్ ల రొమాన్స్ వాణీ కపూర్ అందాలు.. ఇద్దరి మధ్య జరిగే లిప్ లాక్ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. లవ్ లీ రొమాంటిక్ సాంగ్ గా ఈ పాటని అండర్ వాటర్ లో ఎక్కువ భాగం చిత్రీకరించారు. ఈ విజువల్స్ కూడా ప్రత్యేకంగా ఆకట్టుకునేలా వున్నాయి. జూలై 22న విడుదల కానున్న ఈ మూవీ ఎలాంటి ఎక్స్ పీరియన్స్ ని ఆడియన్స్ కి అందిస్తుందో వేచి చూడాల్సిందే.

## విశాఖలో 'ఖుషీ'..సెంటిమెంట్ గానా శివ?

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా శివ నిర్వాణ దర్శకత్వంలో 'ఖుషీ' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే కశ్మీర్..హైదరాబాద్ లో రెండు షెడ్యూళ్ల చిత్రీకరణ పూర్తయింది. దీనిలో భాగంగా సామ్ -విజయ్ సహా ప్రధాన తారాణపై ఒకీలక సన్నివేశాలు షూట్ చేసారు. కశ్మీర్ షెడ్యూల్లో జంటపై కొన్ని రొమాంటిక్ సన్నివేశాలు చిత్రీకరించారు.సినిమాలో ఆ సన్నివేశాలు ఆద్యంతం యువతని ఆకట్టుకునేలా? ఉంటాయని తెలుస్తోంది. శివ మార్క్ లవ్ బుల్ ఎంటర్ టైనర్ గా తెరకెక్కుతోన్న 'ఖుషీ' తాజాగా తదుపరి షెడ్యూల్ కి రెడీ అవుతోంది. దీనిలో భాగంగా విశాఖలో కీలక షెడ్యూల్ ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ షెడ్యూల్ లో సామ్-విజయ్ పై ఓ రొమాంటిక్ విరహగీతాన్ని తెరకెక్కించనున్నట్లు తెలిసింది.విశాఖ బీచ్ అందాలు సహా పరిసర ప్రాంతాల్లో ఆ పాట చిత్రీకరణ సాగుతుందని సమాచారం. పాటలో రొమాంటిక్ సన్నివేశాల్లో నాయకా-నాయికలు రియలిస్టిక్ గానే రొమాన్స్ పండిచనున్నారని



తెలుస్తుంది. సన్నివేశం పండాలంటే? రియాల్టీ తప్పని సరిలో భాగంగా శివ క్రియేటివిటీకి అనుగుణంగానే సన్నివేశాలుంటాయని తెలుస్తోంది.ఇక విశాఖలో షూటింగ్ అంటే శివ కి ఎంతో ప్రత్యేకం. ఆయన ప్రతీ సినిమాలో ఓ షెడ్యూల్ తప్పనిసరిగా విశాఖలో ప్లాన్ చేస్తుంటారు. ఆయన గత సినిమాలు 'నిన్నుకోరి'..'మజిలీ' షూటింగ్ ఎక్కువ భాగం దాదాపు విశాఖలోనే జరిగింది. ఆ రెండు సినిమాలు పెద్ద విజయం సాధించాయి. ఇప్పుడు మరోసారి అదే సెంటిమెంట్ గా 'ఖుషీ' ఓ షెడ్యూల్ని విశాఖలో చేస్తున్నారు. సినిమాలో ఈ సన్నివేశాలు..పాట హైలైట్ గా ఉంటుందని సమాచారం.ఆ రకంగా విశాఖ సెంటిమెంట్ తో పాటు.. సొంత జిల్లా ప్రాధాన్యతని శివ చాటుతున్నాడు శివ. ఆయన స్వస్థలం విశాఖ అన్న సంగతి తెలిసిందే. డైరెక్టర్ కాకముందు బీఈడీ చేసి విశాఖ స్కూల్లో పాఠాలు చెప్పిన మాష్టారు దర్శకుడిగా మారిన తర్వాత టీచర్ వృత్తికి దూరమయ్యాడు.తనలో ఆ ఫ్యాషన్ ని 'నిన్నుకోరి' చిత్రంలో ఓ సన్నివేశంలో నాని ని ట్యూషన్ మాష్టారు చూపించారు. అలా డెబ్యూమూవీతోనే టీచర్ వృత్తిపై తన ఫ్యాషన్ చాటుకున్నాడు.

## లెజెండ్ తో పాన్ ఇండియా పోటీలో బిజినెస్ మ్యాన్!

వ్యాపార వేత్తలు హీరోలగా మారడం అనేది చాలా రేర్ గా జరుగుతుంది. సంపాదనతో నిర్మాణ సంస్థల్ని స్థాపించి నిర్మాతలుగా ఎదిగే ఆలోచనే వాళ్లలో ఎక్కువగా కనిపిస్తుంది. కానీ ఈ బిజినెస్ మ్యాన్ వాళ్లకి భిన్నం. సంపాదన కాదు..నటనపై ఆసక్తి..ఫేం కోసం ఏకంగా ముఖానికి మ్యాకప్ వేసుకుని హీరోగా



ఎంట్రీ ఇస్తున్నారు.చెన్నైకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త శరవణన్ అరుల్ సినీ రంగ ప్రవేశం చేస్తున్నారు. కోలీవుడ్ లోనే కాదు మలయాళం.. కన్నడ.. తెలుగు.. హిందీ భాషల్లో ఆయన నటించిన చిత్రాన్ని పాన్ ఇండియా వైడ్ గా రిలీజ్ చేయడానికి రెడీ అవుతున్నారు. న్యూ శరవణన్ స్టూడియోస్ ప్రొడక్షన్స్ పేరుతో బ్యానర్ పై స్థాపించి ' ది లెజెండ్' నిర్మాణంతో పాటు.. అందులో ఆయనే హీరోగా నటిస్తున్నారు.ఈ చిత్రానికి జేడీ- జెయర్ అనే ఇద్దరు దర్శకులు పనిచేస్తున్నారు. హారిస్ జైరాజ్ ఈ చిత్రానికి సంగీతం అదించడం విశేషం. ఇప్పటికే రిలీజ్ అయిన ట్రైలర్ కి మంచి స్పందన వస్తుంది. ఇటీవలే ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ చెన్నైలో ని జవహార్ లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో భారీ ఎత్తున జరిగింది. ఈ వేడుకకు భారీ ఎత్తున సెలబ్రిటీలు పాల్గొన్నారు.అందులోనూ అందమైన హీరోయిన్లు పూజా హెగ్డే.. తమన్నా.. శ్రద్ధా శ్రీనాథ్.. రాయ్ లక్ష్మి.. హన్సిక సహామరికొంత మంది భామలు ఈవెంట్ లో భాగమయ్యారు. దాదాపు 10 మంది స్టార్ హీరోయిన్లు హాజరైనట్లు తెలుస్తోంది. ఈవెంట్ గ్రాండ్ సక్సెస్ అయింది..యంగ్ హీరో లో మెరుపు వేగం తొలి సినిమాలోనే కనిపిస్తుంది.మరి భవిష్యత్ ప్లానింగ్ ఎలా ఉందన్నది తెలియాలి. లెజెండ్ లో శరవణన్ సైంటిస్ట్ పాత్ర పోషిస్తున్నాడు. ఆయనతో పాటు ఈ చిత్రంలో నాజర్..ప్రభు.. వివేక్ ..యోగి బాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.జులై 28న చిత్రాన్ని పాన్ ఇండియా వైడ్ రిలీజ్ చేస్తున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున ప్రచారం చేసే అవకాశం ఉంది. చెన్నై..బెంగుళూరు..ముంబైలో మీడియా మీట్ లు ఏర్పాటు చేయనున్నారని తెలుస్తోంది.

## అరుదైన రికార్డుపై కన్నేసిన కోహ్లి-రోహిత్




బర్మింగ్‌హామ్ వేదికగా ఇవాళ (జులై 9) ఇంగ్లండ్‌తో జరుగనున్న రెండో టీ20లో టీమిండియా ప్రస్తుత, మాజీ సారధులు రోహిత్, విరాట్‌లు ఓ అరుదైన రికార్డుపై కన్నేశారు. ఈ మ్యాచ్‌లో వీరిద్దరూ మరో రెండు బౌండరీలు బాదితే టీ20 ఫార్మాట్‌లో 300 ఫోర్ల అరుదైన మైలురాయిని చేరుకుంటారు. ప్రస్తుతం వీరిద్దరి ఖాతాలో 298 బౌండరీలు ఉన్నాయి. పొట్టి ఫార్మాట్‌లో 300 బౌండరీల రికార్డు ఐర్లాండ్ ఆటగాడు పాల్ స్టిర్లింగ్ పేరిట ఉంది. స్టిర్లింగ్.. 104 టీ20ల్లో 325 బౌండరీలు బాదాడు. ఇదిలా ఉంటే, ఇంగ్లండ్‌తో 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తొలి మ్యాచ్ నెగ్గిన టీమిండియా 1-0 ఆధిక్యంలో కొనసాగుతుంది. తొలి మ్యాచ్‌లో హార్ధిక్ పాండ్యా ఆల్‌రౌండ్ పెర్ఫార్మెన్స్‌తో రెచ్చిపోవడంతో టీమిండియా 50 పరుగుల భారీ తేడాతో ఇంగ్లండ్‌ను మట్టి కరిపించింది.

## ఆసీస్‌ను 'ఆరే'సిన జయసూర్య.. అరంగేట్రం మ్యాచ్‌లోనే రెచ్చిపోయిన లంక స్పిన్నర్

గాలే వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టెస్ట్‌లో లంక లెఫ్ట్ ఆర్మ్ ఆర్థోడాక్స్ స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య అదరగొట్టాడు. అరంగేట్రం మ్యాచ్‌లోనే ఆరు వికెట్ల ప్రదనర్శనతో రెచ్చిపోయాడు. ఆసీస్ బ్యాటింగ్ లైనప్‌ను తన స్పిన్ మాయాజాలంతో ఉక్కిరిబిక్కిరి చేశాడు. ఫలితంగా పర్యాటక ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 364 పరుగులకు ఆలౌటైంది. జయసూర్య తన డెబ్యూ ఇన్నింగ్స్‌లో 36 ఓవర్లలో 118 పరుగులిచ్చి ఆరు వికెట్లు పడగొట్టాడు. ఓవర్‌నైట్ స్కోర్ 298/5 వద్ద రెండో రోజు ఆటను ప్రారంభించిన ఆసీస్.. జయసూర్య మాయాజాలం ధాటికి మరో 66 పరుగులు మాత్రమే జోడించి మిగిలిన 5 వికెట్లు కోల్పోయింది. సెంచరీ హీరో స్టీవ్ స్మిత్ (145 నాటౌట్) ఓవర్‌నైట్ స్కోర్‌కు మరో 36 పరుగులు జోడించి అజేయంగా నిలువగా.. మిగిలిన ఆటగాళ్లంతా పెవిలియన్‌కు క్యూ కట్టారు. లంక రెండో రోజు పడగొట్టిన 5 వికెట్లలో జయసూర్యకు 3 వికెట్లు దక్కాయి. లంక బౌలర్లలో జయసూర్య 6, రజిత 2, ఆర్ మెండిస్, తీక్షణ తలో వికెట్ పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన లంక జట్టు లంచ్ సమయానికి వికెట్ నష్టపోకుండా 8 పరుగులు చేసింది. అంతకుముందు తొలి రోజు ఆటలో స్మిత్‌తో పాటు మార్నస్ లబుషేన్ (156 బంతుల్లో 104; 12 ఫోర్లు) సెంచరీ సాధించిన విషయం తెలిసిందే. వీరిద్దరు మూడో వికెట్‌కు 134 పరుగులు జోడించి ఆసీస్‌ను ఆదుకున్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190